# నవతరం
నేటితరం కోసం...

హైదరాబాద్ | బుధవారం, డిసెంబరు 31, 2025 | సంపుటి:11 | సంచిక : 252 | పేజీలు: 8 | వెల : రూ.5




## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కన్నుమూత

ధాకాలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

2లో

# కాలుష్యరహిత హైదరాబాదే లక్ష్యం

కోర్ అర్బన్ ప్రాంతానికి సమూల ప్రక్షాళన

ప్లాస్టిక్‌కు నో.. ఈవీలకు ఓకే

గుంతలు, చెత్త కనిపిస్తే బాధ్యత తప్పదు

గుడ్ నుంచి స్మార్ట్ పాలనకు మారాలి

క్షేత్రస్థాయిలోనే జోనల్ కమిషనర్లు



హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌ను సంపూర్ణంగా కాలుష్యరహిత మహానగరంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్లాస్టిక్ వినియోగంపై నిషేధంతో పాటు డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. నగర రహదారులపై గుంతలు, చెత్త ఎక్కడా కనిపించకూడదని అధికారులకు తేల్చిచెప్పారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలోని ప్రాంతాలను పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. క్యూర్ పరిధిని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించినట్లు తెలిపారు. పరిపాలనను పట్టాలెక్కించడమే ప్రభుత్వ ఉద్దేశమని, ఇందుకు అధికారులు మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. నగరంలో చెత్త నిర్వహణ అత్యంత సంక్లిష్టమైన సమస్యగా మారిందని సీఎం పేర్కొన్నారు. రోడ్లపై ఎక్కడా చెత్త కుప్పలు, గుంతలు ఉండకూడదని స్పష్టం చేశారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడాలని, చెత్త డంపింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు జనవరి నుంచి నాలాల్లో పూడికతీత పనులు ప్రారంభించాలని తెలిపారు. పెద్ద చెరువులను గుర్తించి పునరుద్ధరించి యాక్టివిటీ జోన్లుగా అభివృద్ధి చేయాలని

(మిగతా 2వ పేజీలో)

## గ్రూప్-2 రిజర్వేషన్లపై పిటిషన్లు కొట్టివేసిన ఏపీ హైకోర్టు... నియామకాలకు లైన్ క్లియర్

ఏపీ గ్రూప్-2 ని అభ్యర్థులకు భారీ ఊరట..

గ్రూప్-2 రిజర్వేషన్లపై హైకోర్టు కీలక తీర్పు

రోస్టర్ పాయింట్లపై దాఖలైన అన్ని పిటిషన్లను తోసిపుచ్చిన ధర్మాసనం

లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు లభించిన భారీ ఊరట



ఆంధ్రప్రదేశ్ గ్రూప్–2 అభ్యర్థులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గ్రూప్–2 నియామకాల్లో రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లన్నింటినీ ఏపీ హైకోర్టు కొట్టివేసింది. మంగళవారం వెలువడిన ఈ తీర్పుతో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ నిర్ణయం లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపశమనం కలిగించింది. 2023లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) జారీ చేసిన గ్రూప్–2 నోటిఫికేషన్‌పై పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రధానంగా మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు (ఎక్స్–సర్వీస్‌మెన్), క్రీడాకారులకు కేటాయించిన ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు నిబంధనల ప్రకారం లేవని పిటిషనర్లు ఆరోపించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను సరిచేసి, పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్తది జారీ చేయాలని కోరారు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చుతూ తీర్పు వెలువరించింది. అన్ని పిటిషన్లను కొట్టివేయడంతో నియామక ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఇప్పటికే గ్రూప్–2 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో, ఈ తీర్పు అభ్యర్థుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. రోస్టర్ పాయింట్ల వివాదంతో నియామకాలు ఎక్కడ ఆగిపోతాయోనని ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు ఈ తీర్పు ఊరటనిచ్చింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో ఏపీపీఎస్సీ తదుపరి నియామక ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంది.

## సంక్రాంతి ముంగిట హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు: మంత్రి కోమటిరెడ్డి



హైవేపై సంక్రాంతి ట్రాఫిక్ నివారణకు ఉన్నతాధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

జనవరి 8 నుంచి హైదరాబాద్-విజయవాడ మార్గంలో భారీ రద్దీ అంచనా

పండుగ వేళ హైవే లేన్‌లు మూసివేసే పనులు నిలిపివేయాలని ఆదేశం

## బీఆర్ఎస్ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా హరీష్ రావు, సబిత, తలసాని

శాసనమండలి ఉపనేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

మండలి విప్‌గా దేశపతి శ్రీనివాస్‌కు బాధ్యతలు

అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ కేసీఆర్ కీలక నిర్ణయం





## తెలంగాణలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం..

సి.ఐ వింగ్ సమాచారంతో 62 డ్రగ్స్ నెట్‌వర్క్‌లు ఛేదించిన పోలీసులు

తెలంగాణలో 62 డ్రగ్స్ ముఠాలను ఛేదించిన సి.ఐ వింగ్

ఏడాది మొత్తంలో 171 మంది నిందితుల అరెస్ట్

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేక డ్రైవ్

డీజే పార్టీలో డ్రగ్స్ తీసుకున్న 8 మందిని గుర్తించిన ఈగిల్ ఫోర్స్





## గ్రూప్-1పై ఉత్కంఠకు బ్రేక్.. 22న హైకోర్టు తీర్పు

గ్రూప్-1 మెయిన్స్ వివాదంపై వాదనలు పూర్తి

సింగిల్ జడ్జి ఆదేశాలపై టీజీపీఎస్సీ అప్పీళ్లు

రీ-వాల్యుయేషన్ లేదా రీ-ఎగ్జామ్‌పై తుది నిర్ణయం

అవకతవకలపై ఆధారాలు లేవన్న ప్రభుత్వ వాదన

ఫలితాల తర్వాతే పిటిషన్లు వేశారని అభ్యంతరం

వచ్చే నెల 22న తీర్పు ప్రకటిస్తామన్న ధర్మాసనం



## సుప్రీంకోర్టులో గంటల తరబడి వాదనలకు ఫుల్‌స్టాప్

న్యాయవాదుల వాదనలకు నిర్ణీత సమయం

సీజేఐ సూర్యకాంత్ ఆదేశాలతో కొత్త ఎస్ఓపీ

ముందస్తుగా టైం, రాతపూర్వక నోట్స్ తప్పనిసరి

పెండింగ్ కేసులు తగ్గించడమే లక్ష్యం

సత్వర న్యాయానికి సుప్రీంకోర్టు సంస్కరణ

# రాష్ట్రంలో 2.33% తగ్గిన నేరాలు

తెలంగాణ నేర వార్షిక నివేదిక విడుదల

ఇతర రాష్ట్రాలకు భిన్నంగా సైబర్ నేరాల్లో కూడా తగ్గుదల

దొమ్మీలు, కొట్లాటలు 47 శాతం తగ్గుముఖం

రోడ్డు ప్రమాదాలు స్వల్పంగా పెరిగినా మరణాలు తగ్గాయి

డ్రగ్స్‌పై ఉక్కుపాదం.. కేసుల సంఖ్య పెరిగింది

హైదరాబాద్, డిసెంబరు 30 : రాష్ట్రంలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మొత్తం నేరాలు 2.33 శాతం తగ్గాయని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. శాంతిభద్రతల పరిస్థితి మెరుగ్గా ఉందని, పోలీసుల పటిష్ఠ చర్యల వల్ల నేరాల నియంత్రణ సాధ్యమైందన్నారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో సీనియర్ అధికారులతో కలిసి 2025 తెలంగాణ నేర వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈ ఏడాది 2,28,695 క్రిమినల్ కేసులు నమోదవగా, గత ఏడాది ఈ సంఖ్య 2,34,158గా ఉందన్నారు. ఐపీసీ (బీఎన్ఎస్) కింద నమోదైన కేసులు కూడా 1.45 శాతం తగ్గాయని వివరించారు. గత ఐదేళ్లతో పోలిస్తే దొమ్మీలు, కొట్లాటలు 47 శాతం తగ్గడం పోలీసుల పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఈ ఏడాది 5.68 శాతం స్వల్ప పెరుగుదల కనిపించినప్పటికీ, ప్రమాదాల్లో మరణాలు 8 శాతం తగ్గాయని చెప్పారు. అలాగే గాయపడిన వారి సంఖ్య 32 శాతం తగ్గిందని, ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు వేగంగా స్పందించడమే ఇందుకు కారణమన్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు దేశవ్యాప్తంగా పెరుగుతున్నా, తెలంగాణలో మాత్రం 3 శాతం తగ్గుదల నమోదైందని వెల్లడించారు. సైబర్ నేరాల



వల్ల జరిగే ఆర్థిక నష్టాన్ని కూడా 21 శాతం వరకు తగ్గించగలిగామని తెలిపారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపడంతో మత్తుమందుల కేసుల సంఖ్య పెరిగిందని డీజీపీ చెప్పారు. గత ఏడాది రూ.139 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకోగా, ఈ ఏడాది రూ.173 కోట్ల మత్తుమందులను సీజ్ చేశామని

(మిగతా 2వ పేజీలో)



## గోదావరి జలాల తరలింపుపై ఏపీకి సీఎం రేవంత్ మద్దతు

తెలంగాణ ప్రయోజనాలకు తూట్లు పొడుస్తున్న కాంగ్రెస్ సర్కార్

బనకచర్ల ప్రాజెక్టుపై అబద్ధాల పరంపర: హరీశ్‌రావు

నల్లమలసాగర్ నిర్మించినా రాష్ట్రానికి నష్టమే

ఏపీ జలదోపిడీకి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

హైదరాబాద్, డిసెంబరు 30 : నాటి తెలంగాణ ఉద్యమ సమయంలో తుపాకులతో బెదిరించి ఉద్యమ ద్రోహిగా నిలిచిన రేవంత్‌రెడ్డి.. నేడు తెలంగాణకు నష్టం కలిగించేలా జలద్రోహానికి పాల్పడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి.హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా గోదావరి జలాలను అక్రమంగా తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రయత్నిస్తుంటే, దాన్ని అడ్డుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దొడ్డిదారిన ఏపీకి మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఏపీ బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు కలిగే ముప్పును ముందుగానే పసిగట్టి రణభేరి మోగించింది బీఆర్ఎస్సేనని అన్నారు. అయితే ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మొదటి నుంచీ అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. అపెక్స్ కమిటీ సమావేశంలో బనకచర్ల అంశమే చర్చకు రాలేదని

(మిగతా 2వ పేజీలో)

# తెలంగాణలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం

**సి.ఐ వింగ్ సమాచారంతో 62 డ్రగ్స్ నెట్‌వర్క్‌లు ఛేదించిన పోలీసులు**

**తెలంగాణలో 62 డ్రగ్స్ ముఠాలను ఛేదించిన సి.ఐ వింగ్**

**ఏడాది మొత్తంలో 171 మంది నిందితుల అరెస్ట్**

**న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేక డ్రైవ్**

**డీజే పార్టీలో డ్రగ్స్ తీసుకున్న 8 మందిని గుర్తించిన ఈగిల్ ఫోర్స్**

**పబ్‌లు, క్లబ్‌లపై కొనసాగుతున్న ఆకస్మిక తనిఖీలు**



తెలంగాణలో మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ ఏడాది (2025) రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ (సి.ఐ) విభాగం అందించిన పక్కా సమాచారంతో జరిపిన ఆపరేషన్లలో 62 డ్రగ్స్ ముఠాలను ఛేదించి, 171 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ చర్యలతో డ్రగ్స్ రవాణా వ్యవస్థకు గట్టి దెబ్బ తగిలినట్లయింది. సి.ఐ విభాగం నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం ఆధారంగా, వివిధ ఏజెన్సీలతో కలిసి పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా ఈ దాడులు నిర్వహించారు. అరెస్టయిన వారిలో కొందరు విదేశీయులు కూడా ఉన్నట్లు తెలిసింది. 2025 సంవత్సరం పొడవునా ఈ ఆపరేషన్లు కొనసాగినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లో పోలీసులు డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టారు. హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ), ఈగిల్ ఫోర్స్ వంటి ప్రత్యేక బృందాలు నగరంలోని పబ్‌లు, క్లబ్‌లు, బార్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందుకోసం 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇటీవల సైబరాబాద్ పోలీసులు, ఈగిల్ ఫోర్స్ సంయుక్తంగా ఒక డీజే పార్టీపై జరిపిన దాడిలో డ్రగ్స్ తీసుకున్న 8 మందిని గుర్తించారు. వీరంతా ఇప్పటికే పోలీసుల అనుమానితుల జాబితాలో ఉన్నవారేనని అధికారులు తెలిపారు. అలాగే, డిసెంబర్ 27, 28 తేదీల్లో హెచ్-న్యూ బృందాలు నిర్వహించిన తనిఖీల్లో 65 మందిని స్క్రీన్ చేయగా, ఒకరు గంజాయి తీసుకున్నట్లు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడిన వారికి శిక్ష విధించడం కంటే, వారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చి కౌన్సెలింగ్, పునరావాసం కల్పించడమే తమ లక్ష్యమని పోలీసులు వెల్లడించారు. న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా ఈ ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# గ్రూప్-1పై ఉత్కంఠకు బ్రేక్.. 22న హైకోర్టు తీర్పు

**గ్రూప్-1 మెయిన్స్ వివాదంపై వాదనలు పూర్తి**

**సింగిల్ జడ్జి ఆదేశాలపై టీజీపీఎస్సీ అప్పీళ్లు**

**రీ-వాల్యుయేషన్ లేదా రీ-ఎగ్జామ్‌పై తుది నిర్ణయం**

**అవకతవకలపై ఆధారాలు లేవన్న ప్రభుత్వ వాదన**

**ఫలితాల తర్వాతే పిటిషన్లు వేశారని అభ్యంతరం**

**వచ్చే నెల 22న తీర్పు ప్రకటిస్తామన్న ధర్మాసనం**



హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల వివాదంపై దాఖలైన అప్పీళ్లలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వాదనలు పూర్తి చేసింది. ఈ కేసులో వచ్చే నెల 22న తీర్పు వెల్లడిస్తామని స్పష్టం చేసింది. గతేడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లపై సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను టీజీపీఎస్సీతో పాటు ఎంపికైన అభ్యర్థులు సవాల్ చేశారు. సింగిల్ జడ్జి మార్చి 10న విడుదలైన తుది మార్కుల జాబితా, మార్చి 30న ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ జాబితాను రద్దు చేస్తూ.. సమాధాన పత్రాలను మళ్లీ మూల్యాంకనం చేయాలని లేదా అది సాధ్యంకాకపోతే మెయిన్స్‌ను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వులపై టీజీపీఎస్సీ, ఎంపికైన అభ్యర్థులు అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పరీక్షలు నిబంధనల ప్రకారమే జరిగాయని, మూల్యాంకనంలో అవకతవకలకు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఫలితాలు వెలువడిన తర్వాత అర్హత సాధించని వారు పిటిషన్లు వేయడం సరికాదని వాదించారు. రిట్ పిటిషనర్ల తరఫు న్యాయవాదులు మాత్రం ప్రభుత్వ ఆమోదం లేకుండా ఉద్యోగాల సంఖ్య పెంచడం నిబంధనలకు విరుద్ధమని, ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు ఇవ్వడం అనుమానాలకు తావిస్తోందని వాదించారు. కేవలం కొద్ది పరీక్ష కేంద్రాల నుంచే అధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపికయ్యారని, మూల్యాంకనంలో లోపాలు ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తూ.. జనవరి 22న తుది తీర్పు వెల్లడిస్తామని ప్రకటించింది.



# బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కన్నుమూత

## ఢాకాలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

ఢాకా : బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఒక శకం ముగిసింది. మూడుసార్లు ప్రధానమంత్రి పదవిని చేపట్టి దశాబ్దకాలం దేశాన్ని పరిపాలించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అధినేత్రి ఖలీదా జియా మంగళవారం కన్నుమూశారు. తీవ్ర అనారోగ్యంతో ఢాకాలోని ఎవర్‌కేర్ ఆస్పత్రిలో ఉదయం 6 గంటల సమయంలో ఆమె తుదిశ్వాస విడిచారని పార్టీ ప్రధాన కార్యదర్శి మిర్జా ఫఖ్రూల్ ఇస్లాం ఆలంగిర్ తెలిపారు. 80 ఏళ్ల జియా వృద్ధాప్య సమస్యలతో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. నవంబర్ 23న ఛాతి ఇన్ఫెక్షన్‌తో ఆస్పత్రిలో చేరిన ఆమె ఆరోగ్యం నాలుగు రోజులకే మరింత క్షీణించింది. నవంబర్ 27న పరిస్థితి విషమించడంతో కరోనరీ కేర్ యూనిట్‌లో ప్రత్యేక చికిత్స అందించారు. కాలేయం, మూత్రపిండాలు, గుండె సంబంధిత వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ వంటి సమస్యలు ఆమెను పూర్తిగా బలహీనపరిచాయి. చివరిసారిగా నవంబర్ 21న ఢాకా కంటోన్మెంట్‌లో జరిగిన సాయుధ బలగాల కార్యక్రమంలో ఆమె బహిరంగంగా కనిపించారు. జియా తుదిశ్వాస విడిచే వేళ కుమారుడు తారిఖ్ రెహ్మాన్, కోడలు జుబైదా, మనవరాలు జైమా ఆమె పక్కనే ఉన్నారు. పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ విమోచన ఉద్యమ నేత, మాజీ అధ్యక్షుడు జియాఉర్ రెహ్మాన్ సమాధి పక్కనే ఖలీదా జియాను ఖననం చేయనున్నారు. ఢాకాలోని షేర్%-%ఇ%-%బంగ్లా నగర్‌లో ఉన్న జియా ఉద్యాన్‌లో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని తాత్కాలిక ప్రభుత్వం నిర్ణయించింది. జియా మరణంతో దేశవ్యాప్తంగా మూడ్రోజుల జాతీయ సంతాపం ప్రకటించగా, అంత్యక్రియల ప్రార్థనల సందర్భంగా అదనంగా ఒక రోజు సాధారణ సెలవు ఇచ్చారు. భారతదేశం తరఫున విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అంత్యక్రియల్లో పాల్గొననున్నారు. జియా మరణాన్ని వైరి పార్టీ అవామీ లీగ్ నేత షేక్ హసీనా పూడ్చలేని లోటుగా అభివర్ణించారు. దేశ తొలి మహిళా ప్రధానిగా బంగ్లాదేశ్ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో జియా కీలక పాత్ర పోషించారని ఆమె కొనియాడారు. జియా లేని ఖాళీని ఎవరూ భర్తీ చేయలేరని తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మొహమ్మద్ యూనుస్ వ్యాఖ్యానించారు. ఖలీదా జియా మరణంపై భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలువురు దేశాధినేతలు ప్రగాఢ సంతాపం తెలిపారు.

## సుప్రీంకోర్టులో గంటల తరబడి

# వాదనలకు ఫుల్‌స్టాప్

**న్యాయవాదుల వాదనలకు నిర్ణీత సమయం**

**సీజేఐ సూర్యకాంత్ ఆదేశాలతో కొత్త ఎస్‌ఓపీ**

**ముందస్తుగా టైం, రాతపూర్వక నోట్స్ తప్పనిసరి**

**పెండింగ్ కేసులు తగ్గించడమే లక్ష్యం**

**సత్వర న్యాయానికి సుప్రీంకోర్టు సంస్కరణ**



న్యూఢిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో మరో కీలక న్యాయసంస్కరణ అమల్లోకి వచ్చింది. కోర్టుల్లో గంటల తరబడి సాగుతున్న న్యాయవాదుల వాదనలకు ఇకపై కట్టడి చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. కోర్టు సమయాన్ని ఆదా చేయడంతో పాటు, కేసుల విచారణను వేగవంతం చేసి సామాన్యుడికి సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ఈ సరికొత్త విధానాన్ని (ఎస్‌ఓపీ) అమలు చేస్తున్నట్లు తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదేశాల మేరకు ఈ మేరకు సర్క్యులర్ జారీ అయ్యింది. దీని ప్రకారం ఇకపై న్యాయవాదులు తమ వాదనలను నిర్ణీత సమయంలోపే ముగించాల్సి ఉంటుంది. ముందస్తు ప్రణాళికతో రోజుకు ఎక్కువ కేసులను విచారించే అవకాశం ఉంటుందని, దీని ద్వారా పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించవచ్చని సుప్రీంకోర్టు భావిస్తోంది. కొత్త నిబంధనల ప్రకారం కేసు విచారణకు హాజరయ్యే సీనియర్ న్యాయవాదులు తమ వాదనలకు ఎంత సమయం అవసరమో ముందుగానే తెలియజేయాలి. విచారణ తేదీకి కనీసం ఒక రోజు ముందు సుప్రీంకోర్టు ఆన్‌లైన్ అప్పియరెన్స్ పోర్టల్ ద్వారా ఈ వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. మౌఖిక వాదనలతో పాటు లిఖితపూర్వక వాదనలకూ ప్రాధాన్యం ఇచ్చారు. విచారణకు మూడు రోజుల ముందే న్యాయవాదులు తమ వాదనల సారాంశాన్ని ఐదు పేజీలకు మించకుండా రాతపూర్వకంగా సమర్పించాలి. ఈ నోట్స్‌ను అడ్వకేట్ ఆన్ రికార్డ్ లేదా నోడల్ కౌన్సిల్ ద్వారా ఫైల్ చేయడంతో పాటు ప్రతివాదులకు కూడా అందజేయాలి. అలాగే కోర్టు కేటాయించిన లేదా న్యాయవాది ముందుగా పేర్కొన్న సమయానికే వాదనలు ముగించాలని స్పష్టం చేశారు. అనవసర సాగదీతకు తావివ్వకుండా విచారణను సమర్థవంతంగా నిర్వహించడమే ఈ కొత్త విధాన ఉద్దేశమని సుప్రీంకోర్టు తెలిపింది.

# కాలుష్యరహిత హైదరాబాదే లక్ష్యం



సూచించారు. నెలకు మూడు రోజులు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లు నిర్వహించాలని, జనన-మరణ ధ్రువీకరణలు, ట్రేడ్ లైసెన్సులు వంటి సేవలను టెక్నాలజీ ద్వారా మరింత సులభంగా అందించాలని ఆదేశించారు. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో ఏ ప్రాంతం అంధకారంలో ఉండకూడదని, వీధిదీపాలు అన్నీ వెలిగేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. దోమల నివారణ, అంటువ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, వచ్చే ఐదేళ్లకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అధికారుల సమన్వయం, ప్రజల సహకారంతోనే హైదరాబాద్ భవిష్యత్తు మరింత మెరుగ్గా ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు.

## సంక్రాంతి ముంగిట హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు: మంత్రి కోమటిరెడ్డి

తెలుగు రాష్ట్రాల ప్రజలకు అతిపెద్ద పండుగైన సంక్రాంతి సమీపిస్తున్న వేళ, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా పండుగ సమయంలో అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జనవరి 8వ తేదీ నుంచే హైవేలపై వాహన రద్దీ గణనీయంగా పెరిగే అవకాశముందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు సురక్షితంగా, సజావుగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో హైవేలపై మరమ్మతులు లేదా ఇతర కారణాలతో లేన్‌లను మూసివేసే పనులను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అన్ని లేన్‌లు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ జామ్‌లను నివారించేందుకు కీలకమైన ప్రాంతాల్లో, జంక్షన్ల వద్ద అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలని మంత్రి ఆదేశించారు. అలాగే, ప్రయాణికులకు స్పష్టమైన సమాచారం ఇచ్చేలా సైన్ బోర్డులు, రాత్రి వేళల్లో కనిపించేలా హై విజిబిలిటీ బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు సంతోషంగా పండుగను జరుపుకునేలా, వారి ప్రయాణం సాఫీగా సాగేందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యతతో పనిచేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## అసెంబ్లీ, మండలిలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను నియమించిన కేసీఆర్

**అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా హరీష్ రావు, సబిత, తలసాని**

**శాసనమండలి ఉపనేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి**

**మండలి విప్‌గా దేశపతి శ్రీనివాస్‌కు బాధ్యతలు**

**అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ కేసీఆర్ కీలక నిర్ణయం**

తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్న వేళ, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ మరియు శాసన మండలిలో పార్టీ తరఫున వ్యవహరించాల్సిన డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను ఖరారు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను కేసీఆర్ నియమించారు. అలాగే, శాసన మండలిలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలకు బాధ్యతలు అప్పగించారు. మండలిలో పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో, ఉభయ సభల్లో పార్టీ వ్యూహాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు కేసీఆర్ ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## రాష్ట్రంలో 2.33% తగ్గిన నేరాలు

వివరించారు. ఈగల్ పోలీసులు ఇతర రాష్ట్రాల్లోనూ ఆపరేషన్లు నిర్వహించి మత్తు నెట్‌వర్క్‌ను ఛేదిస్తున్నారన్నారు. సైబర్ నేరాలకు సంబంధించిన రికవరీల ద్వారా వేలాది బాధితులకు కోర్టుల ద్వారా నిధులు తిరిగి అందించామని చెప్పారు. రాష్ట్రంలో 509 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారిలో మెజారిటీ ఇతర రాష్ట్రాలకు చెందినవారని తెలిపారు. శిక్షల శాతం గత ఏడాదితో పోలిస్తే 3 శాతం పెరిగిందన్నారు. అలాగే ఈ ఏడాది నమోదైన మిస్సింగ్ కేసుల్లో ఎక్కువ మందిని సురక్షితంగా గుర్తించామని తెలిపారు. శాంతిభద్రతల పరిస్థితిపై వస్తున్న విమర్శలను తోసిపుచ్చిన డీజీపీ.. పోలీసు లెక్కలన్నీ పారదర్శకంగా, పక్కాగా ఉంటాయని స్పష్టం చేశారు. పోలీసు శాఖలో ఆత్మహత్యలను నివారించేందుకు కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, ప్రతి స్థాయిలో సిబ్బందిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించినట్లు తెలిపారు.

## గోదావరి జలాల తరలింపుపై ఏపీకి సీఎం రేవంత్ మద్దతు



చెప్పిన సీఎం మాటలు, ఏపీ మంత్రి బహిరంగంగా చేసిన వ్యాఖ్యలతో పూర్తిగా బట్టబయలయ్యాయన్నారు. ఆ సమావేశంలో తెలంగాణ సీఎం ఇచ్చిన అంగీకారంతోనే జూలై 31న గోదావరి వరద జలాల్లో 200 టీఎంసీల వరకు ఏపీ వినియోగించుకోవచ్చంటూ కేంద్ర జల సంఘం కీలక అనుమతి ఇచ్చిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ నిర్ణయం జరిగి ఐదు నెలలు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కర్ణాటక, మహారాష్ట్ర వంటి పక్కరాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేసినా తెలంగాణ ప్రభుత్వం మాత్రం స్పందించలేదన్నారు.తెలంగాణ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడుగడుగునా అన్యాయం చేస్తోందని ఆరోపించిన హరీశ్‌రావు.. దీనికి నిరసనగా కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీలో ఆందోళన చేపడితే బీఆర్ఎస్ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టుపై మొదటి నుంచీ పోరాడింది బీఆర్ఎస్ అయితే, దాన్ని తమ విజయంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. బనకచర్లకు బదులు నల్లమలసాగర్ ప్రాజెక్టును ప్రతిపాదించినా తెలంగాణకు నష్టమేనని స్పష్టం చేశారు. ఏపీ జలదోపిడీకి అడ్డుకట్ట వేసేలా గోదావరి%-%నల్లమలసాగర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానానికి బీఆర్ఎస్ పక్షాన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. అసెంబ్లీలో చిల్లర రాజకీయ ప్రసంగాలు కాకుండా రాష్ట్ర రైతాంగానికి మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సూచించారు.

# చిరస్మరణీయులు

## సమాజం డొల్లను బహిరంగ పరిచిన "వేమన"



**"అల్పుడెపుడుబల్కు నాడంబరముగాను
సజ్జనుండు బల్కు చల్లగాను
,కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ వినురవేమ"**

తక్కువ బుద్ధికలవాడు ఎప్పుడూ గొప్పలు చెబుతాడు.మంచి బుద్ధికలవాడు తగినంతే మాట్లాడతాడు. కంచు మ్రోగినట్లు బంగారం మ్రోగదుకదా అని అర్థం.

'విశ్వదాభిరామ వినురవేమ' అనే మకుటంతో పై పద్యాన్ని వ్రాసిన ప్రజాకవి వేమన.ఆయన సరళభాషలో "ఆటవెలది" ఛందస్సులో శతకాన్ని రచించాడు.దానిలోని పద్యాలన్నీ సామాజిక,నైతికత,వ్యంగం,తాత్విక తో కూడినవి కావటం విశేషం.ఆయన హతన పద్యాల్లో అన్నీ జీవితసత్యాలు చెప్పారు. ఆయన కడప జిల్లాకు చెందినవారని,ఆయన అసలు పేరు కోమటిచిన వేమారెడ్డి,ఆయన తండ్రి పెదకోమటి వేముడు,సోదరులు వెంకారెడ్డి,రాచ వేమారెడ్డి అని తెలుస్తున్నది.ఆయన గండికోటలోజన్మించారని,ఆయన కాలం1367-1478 మధ్యకాలంలోనని చరిత్రకారుల అభిప్రాయం. ఈయనపద్యాల విషయం మొదట ఆంగ్లేయాధికారి సీపీ బ్రౌన్ ద్వారా వెలికి వచ్చింది.ఆ పద్యాలు 1839లో సీపీ బ్రౌన్ పుస్తకరూపంలో ప్రచురించారు.వేమన జీవిత కాలంపై ఖచ్చితమైన స్పష్టత లేదు.ఆయన కొండవీటి రెడ్డి రాజులు వంశానికి చెందిన వాడని,అచలసిద్ధాంతాన్ని ప్రచారం చేసిన యోగి,సంఘసంస్కర్త అని భావిస్తున్నారు.కాని వ్యవసాయ పరిజ్ఞానం వల్ల ఆయన రైతు కుటుంబానికి చెందినవాడని మరికొందరి అభిప్రాయం.

ఆయన పద్యాలను పరిశోధిస్తే ఆయన మోతుబరి రైతుబిడ్డ అని అనుకోవచ్చు.పదేళ్లప్రాయంలో విద్య కోసం కొండవీడు నుంచి నగరానికి వెళ్లాడు.గురువులవద్ద సంస్కృతం, గణితం నేర్చుకున్నారు. సాముగరడీలయందు ఆసక్తి ఉంది. సంగీతంలో, వీణానాదంలో పరిచయం ఉంది. కలిమి, కులం కలిగినవాడు కనుక (ఆనాటి సామాజిక నీతికి విరుద్ధం కాదు) వేశ్యల ఇంటికి వెళ్లేవాడు.కలిమి కరిగిపోయింది. దాంతో పెద్దలు పెళ్లి చేసారు.కొన్నాళ్ల తరువాత ఇల్లు విడిచి వెళ్లి వేరే కొలువులో చేరాడు.అక్కడ నిక్కచ్చిగా ధర్మం చెబుతుండటంతో తోటివారికి నచ్చలేదు.దాంతో లోకంపై ఏవగింపు కలిగి తిరుగుబాటుదారుడుగా అవతరించాడు. అక్కడి నుంచి దేశపర్యటనచేసి గురువుల శుశ్రూష చేసాడు. లోకోపకారానికి స్వర్ణవిద్యసాధించాలని తిరిగాడు.గురువుల మర్మాన్ని గ్రహించాడు.మోసం,కపటం,నాటకం తెలుసుకున్నాడు. సన్యాసులబ్రతుకుల్లోనూ అదేనని తెలుసుకున్నాడు. వాటిని తన పద్యాల ద్వారా ఎలుగెత్తిచాటాడు.

వేమన భార్య కూతురి పెళ్లి చేసి ఇంటికి రమ్మని అల్లుడి ద్వారా కబురు పంపింది.అప్పటికే ఆయన ఊరూరా తిరిగి తత్వాలు బోధించసాగాడు.ఆయనను "వెర్రివేమన్న" అనేవారు. గురువుల కపటత్వాని నిరసించాడు. జీవితంలో, తత్వంలో, ఆచరణలో అంతగా సాధనచేసి బోధించిన వారు లేరు. అలా తత్వాలు బోధిస్తూ కడప జిల్లా చిట్వేలు మండలం చింతపల్లి వద్ద మహా సమాధి చెందాడని చరిత్రకారుల అభిప్రాయం.

వేమన పద్యాలు లోకనీతులు.సామాజిక చైతన్యం వేమన పద్యాల సారాంశం.వేమన స్పృశించని అంశం లేదు. సమాజంలో అన్ని సమస్యలు భిన్న కోణాల్లో దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని పద్యాలలో ప్రదర్శించారు. కుటుంబ వ్యవస్థ లోటుపాట్లు, మతం పేరిట దోపిడీలు,విగ్రహారాధన నిరసించడం, కుహనా గురువులు,దొంగ సన్యాసులు వంటి ప్రతి సామాజిక అస్వస్థత పై వేమన తనగళాన్ని ప్రతిధ్వనించాడు.

ఆయన పద్యంలో మొదటి రెండుపాదాలు నీతిని బోధిస్తాయి. మూడోపాదంలోతగిన సామ్యం చూపించాడు. అందుకు తగిన ఉదాహరణ..." విద్యలేనివాడు.... కొక్కరులున్నట్లు"," అనగననగరాగ మతిశయించునుండు..... సమకూరు ధరలోన."

మకుటం 'విశ్వదాభిరామ వినురవేమ 'పై మరో అభిప్రాయం ఉంది, వేమన ఆలనా పాలనా చూసిన ఆయన వదిన విశ్వదను,తన ఆప్త మిత్రుడు అభిరాముడిని మకుటంబంలో చేర్చి వారికి శాశ్వితత్వాన్ని ఇచ్చాడని భావిస్తారు. కాని దీనికి మరో అర్థం ఉందని పండితులు వివరించారు. విశ్వద అంటే విశ్వకారుడని,అభిరామ అంటే ప్రియమైనవాడివని, సృష్టికర్తకు ప్రియమైన వేమా,వినుము అని అర్థం చెప్పారు, మానవుని హీనస్థితి కారణమైన వ్యవస్థపై తిరుగుబాటు చేసాడు. దానిలోంచి వచ్చినవే... "చంపదగినయట్టి శత్రువు... పొమ్మనుటే మేలు"పద్యం ద్వారా మానవతను బోధించాడు. "ఉర్వివారికెల్ల..... తగనమ్మజెప్పరా 'పద్యం ద్వారా సర్వమానవ సమానత్వం చాటాడు."మాలవానినంటి మరి.. ఇప్పుడెందేగెనో" పద్యంలో కులవివక్షతను దుయ్యబట్టారు. "ఇంటియాలి విడిచి.. పరిగె ఏరినయట్లు" పద్యంలో నైతికతత వివరిం చాడు. "పిండములను జేసి.... పితరుడెట్లాయరా" పద్యంలో

మూఢనమ్మకాలను నిరశించాడు.స్త్రీలగురించి మాత్రం సాంప్రదాయ వాదిగా కనిపించాడు."ఆలి తొలుత....చిదిమితే బోవునా" పద్యంలో తేటతెల్లం చేసాడు.పితృస్వామ్యాన్ని సమర్ధించడం ఆయనప్రగతిశీలవ్యక్తిత్వానికి మచ్చ తెచ్చేలా ఉంది. వేమన పద్యాలు వందలసంవత్సరాలవరకూ గ్రంథస్తం కాలేదు.భారతదేశం సందర్శించిన ఫ్రెంచి మిషనరీ జేఏ దుబాయ్ 1806లో భారతీయులు అలవాట్లు, ఆచారాలు ఫ్రెంచిలో రాసాడు.దాన్ని1887లో హెన్రీ బ్యూకేంప్ ఆంగ్లంలో అనువదించాడు.దానిలో వేమన పద్యాన్ని ఉటంకించాడు. అది చదివిన బ్రౌన్ వేమనపద్యాలు సేకరించడంతో వెలికి వచ్చాయి.

తెలుగులో వేమన కీర్తి అజరామరం అవడానికి కట్టమంచి రామలింగారెడ్డి ప్రధానకారకుడు.వేమన కవిత్వానికి ఎంత శక్తి అంటే రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ మాటల్లో.." గాయపుమందు గాయానికి కాక,కత్తికే పూసినట్లుండున్" అన్నారు.ఇప్పటికీ వేమన పద్యాలు నిత్యసత్యాలుగా సమాజంలో నేటికి పండితుల,పామరుల నోళ్లలో నానుతునే ఉన్నాయి.ఎప్పటికీ నిజాలు గానే విలసిల్లతున్నాయి.

**- యం.వి.రామారావు,8074129668**





విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కి డైరెక్టర్ జనరల్ గా పదోన్నతి లభించిన శుభ సందర్భంగా విశాఖ పట్నం క్రైమ్ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేయడమైనది. అసోసియేషన్ అధ్యక్షుడు దాడి రవికుమార్ ఆయనకు పుష్ప గుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించడం జరిగింది. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఏబీఎన్ సతీష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం ఎస్ ఆర్ ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి భానోజీ రావు, కోశాధికారి పొట్నూరు వాసు, ఉపాధ్యక్షుడు బండి శివరాం, సంయుక్త కార్యదర్శి నల్ల రాము, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీనివాసరావు,ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కన్నెగంటి విజయ్ మోహన్ తదితరులు పాల్గొని సిపి కి శుభాకాంక్షలు తెలియజేశారు.





### నూతన సంవత్సరానికి
# స్వాగతం!

(శుభ నూతన ఆశీర్వచనం...)

ఓ నా సాహితీ మిత్రులారా...!
సరస్వతీ పుత్రులారా..!
మీ కోసం"స్వాగతం" పలుకుతూ...
ఈ కొత్త వత్సరాన్ని నే కోరేదొక్కటే.....


మీ ముఖంలో
"చిరునవ్వుల వర్షం"
ప్రతి క్షణమూ కురవాలని...
"ఆనందపు తరంగాలు"
మీ ఎదకడలిలో ఎగిసిపడాలని...

మీ ప్రతిశ్వాసలో "ఆరోగ్యం
"ఆణిముత్యంలా" మెరవాలని...
సంతోషపు సుమాలు
మీ "జీవనతోటలో" విరబూయాలని...

కొత్త "ఆశయాల తోరణాలతో"
అడుగులేస్తూ ముందుకు నడవాలని...
ఈ ఏడాది ప్రతి దినం ప్రతి క్షణం
ఒక "వసంతగీతమై" వినిపించాలని...

రోగాలు మీ ఇంటి గడపను తాకరాదని...
ఆరోగ్యమే మీకు "ఆరనిజ్యోతి" కావాలని
మీరు తలపెట్టిన శుభకార్యాలు
"విజయదీపాలై" వెలుగులను
విరజిమ్మాలని మనసారా కోరుకుంటూ...

**రచన:**
**కవి రత్న**
**సాహిత్య ధీర**
**సహస్ర కవి భూషణ్**
**పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్ హైదరాబాద్**



పోలయ్య కూకట్లపల్లి





# ప్రత్యేక పూజలు నిర్వహించిన చెరుకుపల్లి భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్, నవతరం: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలో కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో, వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వైకుంఠ ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తదుపరి.. గోదావరి హోమ్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు విచ్చేసి వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి. మాధవ రెడ్డి, నాగేష్ రెడ్డి, మురళి, సతీష్, సంజీవ్ రెడ్డి, సతీష్ చక్రవర్తి, పాపయ్య, వీరారెడ్డి,నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్,



నల్లనాగుల కృష్ణ, పెద్దింటి సాయిలు, శ్రీను ముదిరాజ్, సందీప్ గౌడ్, నాగదీప్ గౌడ్, శ్రవణ్, ప్రణయ్, ప్రణీత్ పాల్గొన్నారు.

# సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలే పండుగలు



శేరిలింగంపల్లి, నవతరం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కారించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో గల 35 కాలనీలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ప్రతి కాలనీలో పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ మరియు 5 ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుంది. దీనిలో భాగంగా మంగళవారం పాపిరెడ్డి కాలనీలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. విజేతలకు బహుమతి ప్రదానం చేసిన అనంతరం కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవులు మాట్లాడుతూ... పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులు అని అన్నారు. ఈ పోటీల వలన మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తి వెలికి రావడానికి అవకాశం ఉంటుంది. పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగిన తరువాత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయి. నేటి యువతరంకూడా మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించేందుకై ఈ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ముగ్గుల వలన పరిసరాలు పరిశుభ్రతగా ఉంటాయి. గోమయంతో కళ్ళాపి జల్లి బియ్యపుపిండితో ముగ్గులు వేయడం వలన బియ్యపు పిండి తినడానికి చీమలు చేరతాయి. ఆ విధంగా చీమలు క్రిమి కీటకాదులు ఇంటిలోనికి రాకుండా అడ్డుకుంటాయి. ఈ ముగ్గులు వేసే ప్రక్రియలో మహిళలు అనేక శరీరక భంగిమలలో పనిచేయవలసి ఉంటుంది. ఈ వ్యాయామ ప్రక్రియ వలన మహిళలలో అనేక గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండేందుకు అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. కావున ప్రతి మహిళ కూడా ప్రత్యేకించి ఈ ధనుర్మాసం మొత్తం నెలరోజులు అత్యంత ఉత్సాహంగా వేకువ జామున లేచి ముగ్గులు వేయడం ప్రారంభిస్తారని అన్నారు. ఈ పోటీలలో విజయలక్ష్మి, రమ్య లు విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీలలో 30 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా నాయకురాలు జ్యోతి, స్వప్న, ఆదిలక్ష్మి, రాణి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు అమ్మయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.





# వైకుంఠ ఏకాదశి సందర్భంగా దేవాలయాలను సందర్శించిన మాద్రి పృథ్వీరాజ్

పఠాన్ చెరు, నవతరం: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలో ప్రముఖ వ్యాపారవేత్త సీసాల రాజు ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న శ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం కార్యక్రమంలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. అలాగే పటాన్‌చెరు ఆల్విన్ కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా నిర్వహించిన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొని దేవాదేవుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాద్రి పృథ్వీరాజ్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఆలయ నిర్వహకులు పాల్గొన్నారు. అనంతరం పటాన్‌చెరు శాంతినగర్‌లో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో సాయి గణేష్ అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని, శబరి కొండ యాత్ర భక్తిశ్రద్ధలతో, సాగాలని ఆకాంక్షించారు.

# శాంతియుత వాతావరణంలో కొత్త సంవత్సరాన్ని స్వాగతించాలి

## అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలకు ముందుగా నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు: ఎమ్మెల్యే జారే



నవతరం,అశ్వారావుపేట : 2026 నూతన ఆంగ్ల సంవత్సరం మరో రెండు రోజుల్లో రానున్న నేపథ్యంలో అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలకు గౌరవ శాసనసభ్యులు జారెఆదినారాయణ ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉల్లాసంగా జరుపుకోవాలని కోరారు.అదే సమయంలో డిసెంబర్ 31 రాత్రి శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం రహదారులపై అల్లరి అనవసరమైన గొడవలు శబ్ద కాలుష్యం కలిగించే కార్యకలాపాలు నిర్వహించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ప్రజల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని పోలీసు శాఖకు సహకరించి శాంతియుత వాతావరణంలో కొత్త సంవత్సరాన్ని స్వాగతించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలందరికీ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# దుర్గంచెరువు ఆక్రమణలకు హైడ్రా చెక్

**5 ఎకరాల మేర కబ్జాలను తొలగించిన హైడ్రా**

**116 ఎకరాలకు మిగిలిన 160 ఎకరాల చెరువు**

**కబ్జాల పర్వాన్ని చెబెతున్న శాటిలైట్ చిత్రాలు**














హైదరాబాద్, నవతరం: చుట్టూ ఎత్తైన కొండల మధ్య సీక్రెట్ లేక్ గా పేరుగాంచిన దుర్గంచెరువును కబ్జాల చెర నుంచి హైడ్రా విడిపిస్తోంది. మాధాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు దుర్గం చెరువులో దాదాపు 5 ఎకరాల మేర ఉన్న కబ్జాలను హైడ్రా మంగళవారం తొలగించింది. మట్టితో నింపి వాహనాల పార్కింగ్ కోసం వినియోగించి ప్రతి నెలా రూ. 50 లక్షల వరకూ అద్దెలు వసూలు చేస్తున్న దందాకు హైడ్రా చెక్ పెట్టింది. అక్కడి వాహనాలను ఖాళీ చేయించి ప్రస్తుతానికి ఫెన్సింగ్ వేసింది. తర్వాత మట్టిని తొలగించేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటోంది. అక్కడ బాహాటంగా జరిగిన కబ్జాలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులతో విచారణ చేయమని ఆదేశించారు. ఈమేరకు పరిశీలించిన హైడ్రా అధికారులు.. కబ్జాలను నిర్ధారించుకున్నారు. హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం 5 ఎకరాల మేర ఉన్న ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు.

**దుర్గం చెరువుకు ఆక్రమణల దుర్గంధం**

గోల్కొండ కోటలోని రాజవంశానికి తాగు నీరందించిన దుర్గం చెరువుకు ఆక్రమణల దుర్గంధం అంటుకుంది. చుట్టూ కొండల మధ్య ఎంతో శుద్ధమైన జలాలతో దాహార్తిని తీర్చిన ఈ చెరువు కబ్జాలతో కుంచించుకుపోయింది. నగరం నడిబొడ్డున.. ఐటీ కారిడార్‌లో అందమైన సరస్సుగా అలరించిన దుర్గం చెరువు మురుగునీటితో దుర్గంధంగా మారింది. ఒకప్పుడు 160 ఎకరాల మేర ఉన్న చెరువు నేడు 116 ఎకరాలుగా మిగిలిపోయింది. చెరువుకు ఉత్తర దిశ తప్పితే.. మూడువైపులా ఆక్రమణలకు గురైంది. 1976 నాటికే 29 ఎకరాల వరకూ కబ్జా అయి.. 131.66 ఎకరాలకు మిగిలిపోయింది. 1976 వ సంవత్సరం నుంచి 1995 వరకూ భద్రంగానే ఉంది. 1995 నుంచి 2000 సంవత్సరం వరకూ మరో 10 ఎకరాల మేర కబ్జాకు గురై..121 ఎకరాలకు కుంచించుకుపోయింది. 2000 నుంచి నేటికి మరో 5 ఎకరాలు కబ్జాకు గురయ్యింది. ఇలా ఎప్పుడు ఏ సంవత్సరంలో కబ్జాల పర్వం ఎలా సాగిందో ఎన్ ఆర్ ఎస్ సీ అందించిన శాటిలైట్ చిత్రాలు కళ్లకు కడుతున్నాయి.

**మట్టితో నింపుతూ ఆక్రమణలు..**

మాధాపూర్ ఇన్ ఆర్బిట్ మాల్ వైపు ఏకంగా 5 ఎకరాలు కబ్జాలకు గురైంది. కొండలను తవ్వుతూ భవంతులు నిర్మించిన వారికి దుర్గం చెరువు డంపింగ్ యార్డుగా మారింది. 10 నుంచి 15 మీటర్ల మేర మట్టితో నింపి క్రమంగా చెరువులోకి జరిగి ఏకంగా 5 ఎకరాలను కబ్జా చేశారు. అలా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమించిన స్థలం నాదంటూ ఓ ప్రజాప్రతినిధి ఇప్పుడు క్లైం చేస్తున్నారు. అంతే కాదు.. స్కూల్ బస్సులు, ఐటీ సంస్థలకు చెందిన వాహనాల పార్కింగ్‌తో ప్రతి నెల రూ. 50 లక్షల వరకూ అద్దెలు అనుభవిస్తున్నారు. భూమికి సంబంధించిన రికార్డులు లేకుండానే అక్కడ పార్కింగ్ దందా చేస్తున్నారు. నెమ్మదిగా మట్టిని నింపుకుంటూ ఎకరం నుంచి 5 ఎకరాల వరకూ ఆ ప్రజా ప్రతినిధి ఆక్రమించేశారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కూడా ఈ ఆక్రమణ అడ్డుగా మారింది. ఆయనదని చెబుతున్న భూమే ప్రతి ఏటా పెరుగుతుండడం గమనార్హం. హెచ్ ఎం డీ ఏ మాత్రం 2014లో 160.7 ఎకరాలుగా నిర్ధారిస్తూ ప్రిలిమనరీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్ ఆర్ ఎస్ సీ, సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ రికార్డుల ఆధారంగా చెరువు వైశల్యాన్ని తేల్చే పనిలో హైడ్రా నిమగ్నమైంది. ఈలోపు చెరువు పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగిస్తోంది.

# గుమ్మడిదలలో కోతుల బెడదకు చెక్

- సొంత నిధులతో ప్రత్యేక ఏర్పాట్లు
- సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి
- హర్షం వ్యక్తం చేసిన మహిళలు గ్రామస్తులు





గుమ్మడిగాల మున్సిపాలిటీ డిసెంబర్ 30 నవతరం:- గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడదకు చెక్ పడింది. సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తన సొంత నిధులతో కోతులను పట్టేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా కోతుల సమస్య తీవ్రంగా మారింది. మహిళలు, వృద్ధులు, పిల్లలు రోడ్లపై నడవాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఇళ్లపైకి కోతులు ఎక్కడం, వస్తువులు పాడుచేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన పలువురు మహిళలు సిజిఆర్‌ను కలిసి సమస్యను వివరించి పరిష్కారం కోరారు. వారి విజ్ఞప్తికి స్పందించిన గోవర్ధన్ రెడ్డి సిజిఆర్ ట్రస్ట్ ద్వారా తన సొంత నిధులతో కోతులు పట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద కోతులను పట్టించి, సురక్షితమైన అడవి ప్రాంతంలో విడిచిపెట్టే చర్యలు చేపట్టారు.

ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలకు అడవి ప్రాంతం సమీపంలో ఉండడం వల్లే ఈ సమస్య ఎక్కువగా ఉత్పన్నమవుతుందని, ప్రజల భద్రత దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులోనూ ట్రస్ట్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సిజిఆర్ సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కుమార్ గౌడ్, రాజశేఖర్, కొండల్ రెడ్డి, మొగులయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, వాసుదేవ రెడ్డి, సూర్యనారాయణ, జయపాల్ రెడ్డి, కరుణాకర్ గౌడ్,నర్సింలు, ఏ. కృష్ణ, చంద్రారెడ్డి, నరసింహారెడ్డి, బిక్షపతి, షాదుల్లా, బాబు, మురళి, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు

**ఉత్తర ద్వార దర్శనం.. సిజిఆర్ దంపతులు**






గుమ్మడిదల మున్సిపాలిటీ డిసెంబర్ 30 నవతరం :- గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, సంధ్య దంపతులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో వంశపారంపర్య ధర్మకర్తలు నరసింహాచార్యులు, రంగనాథాచార్యులు, అచ్యుత్ రామన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, హిందువులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే వైకుంఠ ఏకాదశి అత్యంత పవిత్రమైన, విశేష ప్రాధాన్యత కలిగిన రోజని అన్నారు. స్వామివారి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వీరితో పాటు మాజీ సర్పంచులు లలితా నర్సింహారెడ్డి, దీపా నరేందర్ రెడ్డి, సంజీవరెడ్డి, రాయపు రెడ్డి, గోపాల్, నగేష్ గౌడ్ పాల్గొన్నారు.



## ఘన స్వాగతం పలికిన మాజీ ఎంపీపీ

ఘట్కేసర్, నవతరం: జీహెచ్ఎంసీ ఉప్పల్ జోన్ ఘట్కేసర్ సర్కిల్ మాజీ హెూం శాఖ మంత్రి, మాజీ మేడ్చల్ శాసనసభ్యులు తుళ్ళ దేవేందర్ గౌడ్ యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామినీ కుటుంబ సమేతంగా దర్శించుకోవడానికి వెళ్తున్న సందర్భంగా ఘట్కేసర్ బైపాస్ లో మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, టిటిడిపి నాయకులు, బిజెపి నాయకులు, జేఏసీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## బెల్టు షాపులపై చర్యలు తీసుకోండి


**::: సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**

జగద్గిరిగుట్ట, నవతరం: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జగతగిరిగుట్ట పరిధిలో ప్రశాంతంగా జరిగేలా ఏర్పాటు చెయ్యాలని నిఘా, భద్రత పెంచాలని కోరుతూ నేడు సిపిఐ ఆధ్వర్యంలో సీఐ వెంకటేష్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా వారు సీఐ కి బెల్ట్ షాప్ లు ఈ రెండు రోజులు ఎట్టి పరిస్థితులో నడవకుండా కఠినమైన ఆదేశాలు జారిచేయ్యాలని, అదే విధంగా స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ లాస్ట్ బస్టాప్, స్మశాన వాటిక, ఈ సేవ సెంటర్, హెచ్ఎంటి స్మశాన వాటిక, రింగ్ బస్తి చౌరస్తా, ప్రభుత్వ పాఠశాలల దగ్గర, దేవాలయం మెట్ల దగ్గర, హెచ్ఎంటి ఖాళీ స్థలంలో, రాజీవ్ గృహకల్ప కాని స్థలాల్లో, బెల్ట్ షాపులు, గుట్ట చౌరస్తా తదితర ప్రాంతంలో నిత్యం గస్తీ ఉండేలా ఏర్పాటు చేయాలని కోరారు. గత సంవత్సరం కూడా ప్రశాంతంగా జరిగిందని ఈ సంవత్సరం కూడా ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అవసరమైతే పత్రిక ప్రకటనను విడుదల చేయాలని కోరడం జరిగింది. సీఐ స్పందిస్తూ శాంతి భద్రత ల రక్షణ కోసం తమ వంతుగా పనిచేస్తామని చెప్పి, ఆయా బస్తిల మరియు బెల్ట్ షాప్ ల వివరాలను రాసుకొని ఎలాంటి గొడవలు జరగకుండా చూస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు,రాములు, కోశాధికారి సదానంద్, జర్నలిస్టు రామస్వామి, సిపిఐ నాయకులు సాయిలు, కే వెంకటేష్, శ్రీనివాస్ చారి, రాధాకృష్ణ, శ్రీనివాస్ యాదవ్, కుమారస్వామి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ - ఉపసర్పంచ్‌కు ప్రభుత్వం కఠిన హెచ్చరిక

## జాయింట్ చెక్ పవర్ దుర్వినియోగమైతే పదవి ఊడటమే కాదు.. జైలు శిక్ష తప్పదు!

### జాయింట్ చెక్ పవర్ ప్రాముఖ్యత




నవతరం అశ్వారావుపేట గ్రామ పంచాయతీ నిధుల నిర్వహణలో సర్పంచ్, ఉప సర్పంచ్ ఉమ్మడి సంతకం కీలకమైన భద్రతా వ్యవస్థగా ప్రభుత్వం పేర్కొంది. అభివృద్ధి పనుల కోసం వెచ్చించే ప్రతి రూపాయికి వీరిద్దరి ఆమోదం తప్పనిసరి. అయితే వ్యక్తిగత, రాజకీయ విభేదాల కారణంగా చెక్ పవర్‌ను అడ్డుకోవడం గ్రామాభివృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పారదర్శకతతోనే చట్టపరమైన రక్షణ**

గ్రామ పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన ప్రతి నిర్ణయం తప్పనిసరిగా గ్రామసభ తీర్మానం ద్వారానే జరగాలని ఆదేశించారు. నగదు లావాదేవీలకు బదులుగా ఆన్లైన్ చెల్లింపులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఖర్చుల వివరాలను సమయానుకూలంగా రికార్డుల్లో నమోదు చేయడం ద్వారా ఆడిట్ తనిఖీల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. పారదర్శకత పాటిస్తేనే ప్రజా ప్రతినిధులకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని హెచ్చరించారు.

**అధికార దుర్వినియోగానికి కఠిన శిక్షలు**

ప్రజాధనాన్ని వ్యక్తిగత అవసరాలకు వాడటం, పనులు పూర్తికాకుండానే బిల్లులు డ్రా చేయడం, తప్పుడు లెక్కలు చూపడం, సంతకాలు ఫోర్జరీ చేయడం వంటి చర్యలు తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటువంటి అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, పదవి నుంచి తొలగించడమే కాకుండా జైలు శిక్ష విధించే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుందని పేర్కొంది.

**ఆధిపత్య పోరుతో అభివృద్ధికి బ్రేక్?**

కొన్ని గ్రామాల్లో సర్పంచ్ – ఉప సర్పంచ్ మధ్య ఆధిపత్య పోరు అభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని అధికారులు గుర్తించారు. రాజకీయ కారణాలతో కావాలనే బిల్లులపై సంతకాలు చేయకుండా పనులను నిలిపివేస్తే ప్రభుత్వం కఠినంగా స్పందిస్తుందని హెచ్చరించింది. విచారణలో అభివృద్ధిని అడ్డుకున్నట్లు తేలితే, ఉప సర్పంచ్‌కు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేసే అధికారం కలెక్టర్‌కు ఉందని స్పష్టం చేసింది.

# ఘనంగా ముదిరాజ్ సర్పంచ్‌ల సన్మానం

## తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్.. ఒకే వేదికపై అదినాయకు





హైదరాబాద్, డిసెంబర్ 30,నవతరం: రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన ముదిరాజ్ సర్పంచ్ లకు హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర క్రీడలు మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా మరియు శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికైన దాదాపు 680 మంది సర్పంచ్ , ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్లను సన్మానించారు. ముదిరాజ్ కులానికి సంబంధించిన ముఖ్య నేతలంతా ఒకే వేదిక మీదికి రావడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముదిరాజులు ఆర్థికంగా సామాజికంగా ఎదగడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఉమ్మడి కార్యాచరణ ఉండాలని ముక్తకంఠంతో నేతలు తమ అభిప్రాయం వెలిబుచ్చారు. ముదిరాజ్ కులాన్ని బిసి-డి నుంచి ఏలోకి మార్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. కొత్త సర్పంచులు రాబోవు ఎంపీటీసీ జడ్పిటిసి , కౌన్సిలర్ , కార్పొరేటర్ ఎన్నికల్లో ముదిరాజ్ నాయకులను గెలిపించడంలో కీలక పాత్ర పోషించాలని సమావేశంలో నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జాతీయ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , అఖిల భారత కోలి సమాజ్ ప్రధాన కార్యదర్శి శ్రీ కాసాని వీరేష్ ముదిరాజ్, మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**ఒకే వేదికపై అదినాయకు**

సర్పంచుల సన్మాన కార్యక్రమం వేదికపై ముదిరాజుల అందరికి గౌరవం దక్కెవిధంగా రాష్ట్రంలోని ముదిరాజు అది నాయకులందరూ హాజరైనారు. రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ముదిరాజ్ , ముదిరాజులకు భీష్మ ఆచార్యుల లాంటివారు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజు , మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముదిరాజు , శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజు , డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజు , కాసాని వీరేష్ ముదిరాజు గారు, ఆకుల రాజేందర్ ముదిరాజు , సంజీవ్ ముదిరాజ్ , రోహిత్ ముదిరాజ్ , ఉప్పరి నారాయణ ముదిరాజ్, అందె బాబయ్య ముదిరాజు లాంటి నాయకులందరూ ఒకే వేదికపై చేర్చిన ఘనత ముదిరాజ్ కార్పొరేషణ్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కి దక్కింది.

# నల్లగుట్ట నరసింహస్వామి సన్నిధిలో కూన శ్రీశైలంగౌడ్





కుత్బుల్లాపూర్, నవతరం: కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం సర్కిల్ పరిధి హెచ్.ఏ.ఎల్ కాలనీ లోని నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం లో గిరి ప్రదక్షిణ కు దారి, దేవాలయ గుట్ట మీదకి మెట్ల దారి, మరియు కళ్యాణ మండపానికి ఛానల్ గేట్లను ప్రారంభించారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్. అనంతరం శ్రీశైలం గౌడ్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు శ్రీశైలం గౌడ్ ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఈ దేవాలయం అభివృద్ధికి నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, లక్ష్మీ నరసింహ స్వామి కృప ఎల్లప్పుడూ ప్రజలందరి పైన ఉండాలని, లక్ష్మీ నరసింహ స్వామి దయవల్ల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేకేఎమ్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ ఇంద్రసేన గుప్తా, ఉపాధ్యక్షులు ఎన్ శ్రీరాములు, ఆర్ యాదగిరి ప్రధాన కార్యదర్శి, ఈ సురేష్ కోశాధికారి, నరసింహారెడ్డి కార్యదర్శి, శంకర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రవీందర్ గౌడ్, టీవీ శ్రీను, భాస్కర్ రెడ్డి, మోహన్ రెడ్డి, సిహెచ్ బుచ్చి రెడ్డి, అంజి యాదవ్, గోవర్ధన్ రెడ్డి, ఐ. యాం సాగర్, మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు, కూన రాఘవేంద్ర గౌడ్, చౌడ శ్రీనివాస్, నాగిళ్ల శ్రీనివాస్, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, గౌడ్ శెట్టి శివ ఈశ్వరరావు, షాకీర్, వెంకట్, నర్సింగరావు, మురళి, ప్రభాకర్ రెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పట్నం విందు రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్



సంగారెడ్డి, నవతరం: పటాన్‌చెరు పట్టణంలో నూతనంగా ప్రారంభమైన పట్నం విందు రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కో-ఫౌండర్, ఎండీఆర్ ఫౌండేషన్, మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ యాజమాని అశోక్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ నూతన వ్యాపారం విజయవంతంగా కొనసాగి మంచి పేరు, ప్రతిష్ఠలు సంపాదించాలని ఆకాంక్షించారు. అలాగే వ్యాపార రంగంలో ముందుకు వస్తున్న యువకులు సమాజ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో యాజమాన్యాన్ని, సిబ్బందిని అభినందిస్తూ, ఇలాంటి నూతన వ్యాపారాలు పటాన్‌చెరు పట్టణ అభివృద్ధికి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో దోహదపడాలని ఆకాంక్షించారు.



# నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరగదు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలంగాణ జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీకి హామీ

హైదరాబాద్, నవతరం: గతంలో ఇచ్చిన అక్రెడిటేషన్ కార్డుల కంటే అధికంగా ఇస్తామని, నిజమైన జర్నలిస్టులకు తమ ప్రభుత్వ హయాంలో ఎలాంటి చిన్న అన్యాయం జరగనివ్వబోమని సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తనను కలిసిన జేఏసీ నాయకులకు హామీ ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో జర్నలిస్టు సంఘాల జేఏసీ నాయకులతో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అతి త్వరలో అన్ని జర్నలిస్టు సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, అందరి అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని మరో జీవో తెస్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. డెస్క్ పనిచేసే వారికి, ఫీల్డ్ లో పనిచేసే జర్నలిస్టులకు అనేక సంక్షేమ పథకాలను అంచెలంచెలుగా అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. మంత్రిని కలిసిన జేఏసీ కన్వీనర్లు కే.కోటేశ్వర్ రావు, అనంచిన్ని వెంకటేశ్వరరావు, మామిడి సోమయ్య, పులిపలుపుల ఆనందం, రావికంటి శ్రీనివాస్, గౌటి రామకృష్ణ, రాణా ప్రతాప్, కీర్తి సంతోష్ రాజా తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టు సంఘాలతో త్వరలో సమావేశం

## ఐ అండ్ పిఆర్ కమీషనర్ ప్రియాంక

### తెలంగాణ జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీకి స్పష్టం

హైదరాబాద్, నవతరం: అతి త్వరలో అన్ని జర్నలిస్టు సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, అందరి అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని ముందుకు వెళ్ళాలని నిర్ణయించినట్లు సమాచార కమిషనర్ ప్రియాంక స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రెండు అక్రెడిటేషన్ కార్డుల వ్యవహారంలో జర్నలిస్టుల మధ్య ఎన్నో అనుమానాలను, ఇతర సమస్యలను జేఏసీ నేతలు కమీషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కమీషనర్ ను కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్లు కే.కోటేశ్వర్ రావు, అనంచిన్ని వెంకటేశ్వరరావు, మామిడి సోమయ్య, పులిపలుపుల ఆనందం, రావికంటి శ్రీనివాస్, గౌటి రామకృష్ణ, రాణా ప్రతాప్, కీర్తి సంతోష్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన డా.ఎం.రమేష్,ఐపీఎస్



సైబరాబాద్, నవతరం: 2005 బ్యాచ్ అధికారి డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్ మంగళవారం నాడు సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అవినాష్ మొహంతి స్థానంలో ఆయన నియమితులయ్యారు. ఇది నాయకత్వ పరివర్తనకు గుర్తుగా నిలిచింది. గతంలో ఐజీపీ, ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, ఐజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, సైబరాబాద్ పోలీసుల ప్రధాన బాధ్యత చట్ట పాలనను కాపాడటం మరియు అన్ని పౌరులకు నిష్పాక్షికంగా, న్యాయంగా వ్యవహరించడం, వృత్తి నైపుణ్యం, పారదర్శకత, ప్రజలపై దృష్టి సారించడం అని అన్నారు. ప్రజలకు సురక్షితమైన మరియు సురక్షితమైన వాతావరణాన్ని నిర్ధారించడానికి అన్ని పోలీసు కార్యకలాపాలలో శాంతిభద్రతలను కాపాడటం ప్రాథమిక దృష్టిగా ఉంటుందని ఆయన నొక్కి చెప్పారు. ట్రాఫిక్ నిర్వహణను కూడా ఆయన కీలక ప్రాధాన్యతగా ఎత్తిచూపారు, మద్యం సేవించి వాహనాలు నడపడం కోసం క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రాబోయే నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి, సంఘటనలు, ప్రమాదాలు లేని ఉత్సవాలను నిర్ధారించడానికి ఆయన మార్గదర్శకాలను జారీ చేశారు, అదే సమయంలో అన్ని పోలీసింగ్ కార్యకలాపాలలో పౌరుల అభిప్రాయాన్ని చురుకుగా పరిగణించాలని పోలీసులను ప్రోత్సహించారు.

**బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాలమేరకు శాసన సభలో బీఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్ష ఉప నేతగా డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా నియమితులైన తన్నీరు హరీశ్ రావు కు హృదయపూర్వక అభినందనలు తెలియజేసిన తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ రవీందర్ యాదవ్.**



- (నవతరం, శేరిలింగంపల్లి)






# ఉత్తర ద్వార దర్శనంతో తరించిన భక్తజనం

**భద్రాద్రిలో వైకుంఠ ద్వార దర్శన మహోత్సవం**

**వైకుంఠ రాముడిగా అనుగ్రహించిన భద్రాద్రి రామయ్య**

**వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు విజయవంతం**

**::: జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్**

భద్రాచలం, డిసెంబర్ 30,నవతరం: దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు ఆధ్యాత్మిక వైభవోపేతంగా, భక్తుల హృదయాలను ఉప్పొంగించేలా ఘనంగా నిర్వహించబడ్డాయి. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. వైకుంఠ రాముడిగా అలంకరించబడిన స్వామివారి దివ్య దర్శనంతో భక్తులు పరవశించి, శ్రీ రామ జయ రామ జయ జయ రామ అనే జయజయధ్వానాలతో భద్రాద్రి క్షేత్రం మారుమోగింది. ఉత్తర ద్వార దర్శనాన్ని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీవీఐపీ, వీఐపీ సెక్టార్లతో పాటు సాధారణ భక్తుల కోసం ఏర్పాటు చేసిన వివిధ సెక్టార్లలో భక్తులు శాంతియుతంగా వేడుకలను తిలకించారు. వేదపండితులు, స్థానాచార్యులు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించగా, అర్చకులు 108 ఒత్తులతో మహా హారతి నిర్వహించారు. అనంతరం ఉత్తర ద్వారం ద్వారా దర్శనం అనంతరం ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో భక్తిశ్రద్ధల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామివారు గరుడ వాహనరూపుడిగా శ్రీమహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు విశేష ఆరాధనలు, శ్రీరామ పదాక్షరీ మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన, చతుర్వేద పఠనం, గరుడ ప్రబంధాలు, ఇతిహాస పఠనం, శరణాగతి గజ్జగరుడ దండం, భక్తరామదాసు రచించిన దాశరథి శతక పఠనం నిర్వహించారు. వైకుంఠ రాముడికి అష్టోత్తర శత హారతిని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. భక్తరామదాసు కాలం నుంచీ కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ మూలవిరాట్టులకు స్నపన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం అనంతరం వైకుంఠరాముడు తిరువీధి సేవకు బయలుదేరారు. చలువ చప్పర వాహనంపై పెరియాళ్వార్, నమ్మాళ్వార్, మరో వాహనంపై అండాళ్ అమ్మవారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి, గజవాహనంపై సీతమ్మవారు, గరుడ వాహనంపై శ్రీ సీతారామచంద్రమూర్తుల తిరువీధి సేవ మేళతాళాలు, భాజా భజంత్రీలు, వేద మంత్రోచ్చారణల మధ్య శోభాయమానంగా సాగింది. రాపత్తు ఉత్సవాలతో వేడుకలు మరింత వైభవాన్ని సంతరించుకున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ, ప్రతి సెక్టార్‌లో ఏర్పాట్ల పర్యవేక్షణకు జిల్లా అధికారులు, లైజన్ అధికారులను నియమించారు. బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ వేడుకకు భద్రాచలం, శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్



రావు, పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐ టి డి ఏ పి ఓ రాహుల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఏఎస్పీ విక్రాంత్ సింగ్, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణ దొర తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు.

**వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు విజయవంతం %-% జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు, ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేయగలిగామని తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి, భక్తులకు, పాత్రికేయులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.








**కుత్బుల్లాపూర్ గాజులరామారం ఆక్సిజన్ పార్క్ పరిధిలో స్పోర్ట్స్ క్లబ్ లో నిర్వహించిన కుత్బుల్లాపూర్ మైనార్టీ మేనేజ్మెంట్ స్కూల్స్ అసోసియేషన్ స్పోర్ట్స్ టోర్నమెంట్లో బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి గురుస్వామి, నవాబ్ భాయ్, తదితర నాయకులు పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.**

**-నవతరం, గాజులరామారం**



## నాచారంలో ఇంటి యజమాని హత్య

**::: గోదావరిలో లభ్యమైన మృతదేహం**

హైదరాబాద్ / ఆంధ్రప్రదేశ్, నవతరం: ఇల్లు అద్దెకు ఇచ్చిన యజమాని సుజాత(65) ను బంగారం కోసం హత్య చేసిన కేసును నాచారం పోలీసులు ఛేదించారు. ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేశారు పోలీసులు. ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు వెళ్లి ఆమె మృతదేహం కోసం గాలింపు చేపట్టారు. నిందితుడు అంజిబాబును తీసుకువచ్చి గోదావరిలో గాలించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సుజాత మృతదేహం మామిడికుదురు సమీపంలోని అప్పనపల్లి కె.ఏనుగుపల్లి మధ్య వైనతేయ గోదావరిలో లభ్యమైంది.

# అంగరంగ వైభవంగా అయ్యప్పస్వామి ఉత్సవమూర్తి ఊరేగింపు



కూకట్పల్లి, నవతరం: కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీ లోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, ఆలయ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలపూజ కార్యక్రమాలలో భాగంగా హరిహరపుత్ర శ్రీ అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తి విగ్రహాన్ని ఏనుగు అంబారిపై అలంకరించి వివిధ కళా బృందాలతో ఘన ఊరేగింపు అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ ఊరేగింపు కూకట్‌పల్లి పురవీధుల మీదుగా కొనసాగుతూ భక్తులను ఆధ్యాత్మికోత్సాహంతో ముంచెత్తింది. ఈ మహోత్సవంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వామి భక్తులు, స్థానిక ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.







# నేరస్థులా? విద్యార్థులా?

## ప్రిన్సిపల్ సిబ్బందిపై వేటి వేసిన విద్యా శాఖ
## విద్యార్థి బట్టలు విప్పించి లోదుస్తులు పై నిలబెట్టిన వైనం

నవతరం, అశ్వారావుపేట : హెూంవర్క్ చేయలేదని 8 మంది విద్యార్థుల బట్టలు విప్పించి అందరిముందు నిలబెట్టడం క్రూరత్వం కాదా? ఇలాంటి చర్యల వల్ల ఆ పిల్లల మనసుపై పడే ముద్రను ఎవరైనా తుడిచివేయగలరా?

**జరిగింది ఇదే:**

సెహెూర్ జిల్లాలోని జాట్‌ఖేడా ప్రైవేట్ స్కూల్‌లో అమానుషం. ప్రిన్సిపాల్, సిబ్బందిపై వేటు వేసిన విద్యాశాఖ. లక్ష రూపాయల జరిమానాతో సరిపెడితే పిల్లాడికి జరిగిన అవమానం పోతుందా?

“ మాకు తెలియదు. సిగ్గుపడి మా అబ్బాయి ఈ విషయం మాకు చెప్పలేదు. కానీ ఈ రకంగా చదువుకోవడం కంటే మా పిల్లాడు నిరక్షరాస్యుడిగానే ఉండడమే మంచిది. అందరి ముందు వాణ్ని లోదుస్తులతో నిలబెట్టారు. అది వాడి మనస్సుపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసా? వాడేమన్నా నేరస్థుడా?” అని బాధిత పిల్లల కుటుంబాల ఆవేదన”.

**మేల్కొందాం :** కేవలం ఏసీ రూములు, బిల్డింగులు చూసి పిల్లలను చేర్పించడం కాదు..



అక్కడ యాజమాన్యం ఉపాధ్యాయులు ముసుగులో మనుషులు ఉన్నారా లేక మృగాలు ఉన్నారా అనేది తల్లిదండ్రులు గమనించాలి.

**మారాల్సింది..** చట్టాలు అమలు చేయాలేని ప్రభుత్వ లు... అధికారులు.. ! చట్టం అమలు చేసుకొలేని తల్లిదండ్రులు .... వారి ఆలోచనలు .. మూర?త్వం. ఆశాలు !

# 1000 గజాల పార్కును కాపాడిన హైడ్రా



## రూ.13 కోట్ల విలువైన స్థలంచుట్టూ ఫెన్సింగ్

రంగారెడ్డి, నవతరం: శేరిలింగంపల్లి మండలం మదీనాగూడ విలేజ్‌లో 1000 గజాల పార్కును హైడ్రా సోమవారం కాపాడింది. దీని విలువ రూ. 13 కోట్ల వరకూ ఉంటుంది. సర్వే నంబరు 23లో ఉషోదయ ఎన్‌క్లేవ్ పేరిట హుడా అనుమతి పొందిన లే ఔట్ ఉంది. ఇందులో 1000 గజాల స్థలాన్ని పార్కుకు కేటాయించారు. జీహెచ్ ఎంసీకి ఈ మేరకు గిఫ్ట్ డీడ్ కూడా చేశారు. ఇలా ప్రజల వినియోగంలో ఉండాల్సిన పార్కు స్థలాన్ని స్థానికంగా ఉన్న ఓ పెద్దాయన కబ్జా చేసి చుట్టూ ప్రీకాస్ట్ వాల్ నిర్మించి తన ఆధీనంలో ఉంచుకున్నారు. ఇక అక్కడి నుంచి ఉషోదయ ఎన్‌క్లేవ్ నివాసితుల పోరాటం సాగుతోంది. పార్కుకోసం కేటాయించినట్టు స్పష్టమైన వివరాలున్నా.. ఆ మేరకు పార్కును కాపాడడంలో స్థానిక యంత్రాంగం విఫలమైంది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జీహెచ్ ఎంసీ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా.. పార్కు స్థలంగానే నిర్ధారించుకుని సోమవారం ప్రహరీని కూల్చేసి.. చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ప్రజావసరాలకు పార్కుగా కేటాయించిన స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను కూడా ఏర్పాటు చేసింది.

# క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిలకు ఆర్థిక భరోసా

## ప్రజాపాలన ప్రభుత్వానికి కృతజ్ఞతలు

కుత్బుల్లాపూర్, నవతరం: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ప్రజాపాలన ప్రభుత్వంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని చర్చిలకు ఒక్కో చర్చికి ముప్పై వేల రూపాయలు చొప్పున మంజూరు చేసి, ఎటువంటి దళారీ ప్రమేయం లేకుండా నేరుగా చర్చ్ పాస్టర్ల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేయడం జరిగింది. చర్చుల సుందరీకరణకు, అభివృద్ధికి ఆర్థిక భరోసా అందించిన ఈ సహకారానికి గాను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కుత్బుల్లాపూర్ క్రిస్టియన్ మైనారిటీ కోఆర్డినేటర్ కల్లోజి రవికుమార్ సమన్వయంలో నియోజకవర్గ పాస్టర్స్ అధ్యక్షులు బిషప్ గోడి శేఖర్ ఆధ్వర్యంలో, రివైవల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంగా గాజులరామారం డివిజన్ శ్రీరామ్ నగర్‌లోని సీయోను చర్చ్ లో కేక్ కటింగ్ చేసి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ శాల్వాతో సత్కరించారు. అనంతరం హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ... అన్ని మతాలను సమానంగా గౌరవించే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం క్రైస్తవ మైనారిటీల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొత్త సంవత్సరం ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.వి. పాల్ గెస్ట్ స్పీకర్‌గా, కే. బాబురావు (రిటైర్డ్ డీజీపీ), సురేష్, అభిషేక్, సీఎం కుత్బుల్లాపూర్ రివైవల్



పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు బిషప్ గోడి శేఖర్, జనరల్ సెక్రటరీ బిషప్ ఎం.ఎస్. పీటర్, ట్రెజరర్ దయానిధి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాస్టర్ రాజశేఖర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకు చెందిన నిజాంపేట్, దుండిగల్, కొంపల్లి ఫెలోషిప్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, ట్రెజరర్లు, ఇతర నాయకులు, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

# దేశ జీడీపీ కన్నా మన ఇళ్లలో దాచిన బంగారం విలువే ఎక్కువ..
# భారత ఆర్థిక వ్యవస్థకే సవాల్ విసురుతున్న పసిడి ప్రియులు

దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరల్లో ఇటీవల చోటు చేసుకున్న మార్పులు సామాన్య ప్రజలతో పాటు ఆర్థిక వర్గాల్లోనూ తీవ్రమైన చర్చకు దారి తీస్తున్నాయి. భారతీయుల పెట్టుబడి అలవాట్లను పరిశీలిస్తే, స్టాక్ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్స్ కంటే బంగారం, వెండి వంటి విలువైన లోహాలపై ఎక్కువ నమ్మకం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నమ్మకంలో భాగంగానే భారతీయ గృహాల్లో ఉన్న బంగారం విలువ ఇప్పుడు ఎవరూ ఊహించని స్థాయికి చేరింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ బంగారం మొత్తం విలువ భారతదేశపు మొత్తం స్థూల దేశీయోత్పత్తి కంటే కూడా ఎక్కువగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరాయి. ఇటీవల ట్రేడింగ్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 4,500 డాలర్లను దాటి 4,550 డాలర్ల స్థాయిలో ట్రేడ్ అవుతోంది. ఈ ధరల పెరుగుదల భారతీయుల వద్ద ఉన్న బంగారం సంపద విలువను భారీగా పెంచింది. ప్రముఖ ఆర్థిక సంస్థ మోర్గాన్ స్టాన్లీ నివేదిక ప్రకారం.. భారతీయ గృహాల్లో సుమారు 34,600 టన్నుల బంగారం నిల్వగా ఉంది. ప్రస్తుత అంతర్జాతీయ ధరలను పరిగణనలోకి తీసుకుంటే, ఈ బంగారం మొత్తం విలువ 5 ట్రిలియన్ డాలర్లు దాటుతుంది. ఇది ప్రపంచంలో ఏ దేశానికీ లేని ప్రత్యేకమైన స్థితి అని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి గణాంకాల ప్రకారం.. భారతదేశం మొత్తం



విలువ సుమారు 4.1 ట్రిలియన్ డాల్లరు మాత్రమే. అంటే, దేశ ప్రజల ఇళ్లలో ఉన్న బంగారం సంపద, దేశం ఒక ఏడాదిలో సృష్టించే మొత్తం ఆర్థిక ఉత్పత్తి కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది భారతీయ సమాజంలో బంగారానికి ఉన్న సాంస్కృతిక, ఆర్థిక ప్రాధాన్యతను మరోసారి రుజువు చేస్తోంది.

వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ డేటా ప్రకారం.. ప్రపంచ బంగారు డిమాండ్‌లో భారతదేశం సుమారు 26 శాతం వాటా కలిగి ఉంది. ఈ జాబితాలో చైనా 28 శాతంతో అగ్రస్థానంలో ఉంది. భారతదేశంలో ఇప్పటికీ బంగారు ఆభరణాలే ప్రధాన వినియోగ రూపంగా ఉన్నప్పటికీ.. ఇటీవలి కాలంలో బంగారు కడ్డీలు నాణేలు వంటి పెట్టుబడి రూపాల్లో డిమాండ్ వేగంగా పెరుగుతోంది. ఇది ప్రజలు బంగారాన్ని కేవలం అలంకరణకు కాకుండా, భద్రమైన పెట్టుబడి సాధనంగా కూడా చూస్తున్నారనే విషయాన్ని సూచిస్తుంది. బంగారం ప్రాధాన్యత ప్రభుత్వ స్థాయిలోనూ స్పష్టంగా కనిపిస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా తన విదేశీ మారక నిల్వలను బలోపేతం చేయడానికి బంగారాన్ని కొనుగోలు చేస్తోంది. 2024 నుండి ఇప్పటివరకు దాదాపు 75 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. దీంతో దేశంలోని కేంద్ర బ్యాంక్ వద్ద మొత్తం బంగారు నిల్వలు సుమారు 880 టన్నులకు చేరాయి. మోర్గాన్ స్టాన్లీ ప్రకారం, ఇది భారతదేశ మొత్తం విదేశీ మారక నిల్వల్లో దాదాపు 14 శాతం వాటాను సూచిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే బంగారం భారతీయ ఆర్థిక వ్యవస్థలో కేవలం లోహం మాత్రమే కాదు, అది భద్రత, సంపద, విశ్వాసానికి ప్రతీకగా మారింది.

## విజిలెన్స్ వ్యవహారాలను వెంటనే వెల్లడించాలి

ప్రభుత్వరంగ బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు హెూల్‌టైమ్ డైరెక్టర్లకు (డబ్ల్యూటీడీ) సంబంధించి విజిలెన్స్ వ్యవహారాలను వెంటనే నివేదించాలని కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశించింది. బోర్డు స్థాయిలో నియామకాలకు సంబంధించి ప్రతికూల సమాచారాన్ని సకాలంలో నివేదించని పలు సంఘటనల నేపథ్యంలో ఆర్థిక శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్) ఈ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వరంగ సంస్థల చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌ల నుంచి విజిలెన్స్ క్లియరెన్స్ కోరినప్పుడే.. ప్రైవేటు ఫిర్యాదులు, కోర్టుల పరిశీలనలు, సీబీఐ లేదా ఇతర చట్టపరమైన దర్యాప్తు సంస్థల సూచనలు వెలుగు చూస్తున్నట్టు పేర్కొంది. ఇందులో హెూల్‌టైమ్ డైరెక్టర్లకు సంబంధించి కీలక సమాచారాన్ని విజిలెన్స్ క్లియరెన్స్ ఫార్మాట్‌ల నుంచి తొలగించడాన్ని ప్రస్తావించింది. దీంతో బోర్డు స్థాయిలో అధికారులకు సంబంధించి ప్రతికూల సమాచారాన్ని తక్షణమే తెలియజేయాలంటూ ప్రభుత్వరంగ బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలను ఆర్థిక శాఖ ఆదేశించింది.




## కేసీఆర్‌ను కలిసిన పుప్పాల క్రాంతికుమార్



హైదరాబాద్, నవతరం: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ను పిడిఎస్ఎల్ యూకే అధినేత పుప్పాల క్రాంతి కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని దేశ విదేశాల్లో మరింత పెంచుతూ, ముఖ్యంగా యూకే లో తెలంగాణ వాసులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో పిడిఎస్ఎల్ యూకే సంస్థ కీలక పాత్ర పోషిస్తున్నదని ప్రశంసించారు. రాష్ట్రంలోని ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినందుకు పుప్పాల క్రాంతి కుమార్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అంతేకాకుండా భవిష్యత్తులో కూడా తెలంగాణ యువత అభివృద్ధి, రాష్ట్ర ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా పిడిఎస్ఎల్ యూకే సంస్థ సేవలు కొనసాగించాలని కేసీఆర్ ఆకాంక్షించారు.



**వైకుంఠ, ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని చిట్కుల్‌లోని వారి స్వగృహం నందు సుదర్శన దేవత యొక్క పరిపూర్ణ అనుగ్రహ హెూమం జరిపించి రాష్ట్ర ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని ప్రార్ధించారు పటాన్చెరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నీలం మధు ముదిరాజ్.**

**- నవతరం, పటాన్చెరు**

**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలో బాలాజీ లేఔట్ లో నవ్య ఫోటో స్టూడియో ప్రారంభోత్సవంలో పాల్గొన్న బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి.**

**- (నవతరం, గాజులరామారం)**



## నిందితులకు కఠిన శిక్ష, పరిహారం

హైదరాబాద్, నవతరం: ఆర్‌జిఐఏ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు 10-10-2016న జరిగిన ఒక సంఘటనకు సంబంధించి బాధితురాలి నుండి ఫిర్యాదు అందింది. బాధితురాలు తన స్నేహితురాలు ఐషా అలియాస్ సనాతో కలిసి మొహర్రం పండుగను జరుపుకోవడానికి షాహీన్ నగర్‌కు వెళ్లింది. తరువాత, వారు ఆరామ్‌ఘర్‌కు ఆటోలో వెళ్లారు. అక్కడ ఐషా బాధితురాలిని ఒక క్వాలిస్ కారు వద్దకు తీసుకెళ్లి, అందులో తన కుటుంబం ఉందని చెప్పింది. ఆ తర్వాత, క్వాలిస్ కారులో ఉన్న ఐదుగురు వ్యక్తులు బాధితురాలిని కిడ్నాప్ చేసి, శంషాబాద్‌లోని ఇందిరా నగర్, దొడ్డిలో ఉన్న ఒక ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి కత్తితో బెదిరించారు. వారు ఆమెపై లైంగిక దాడి చేసి అత్యాచారం చేయడానికి ప్రయత్నించారు. బాధితురాలు ముళ్ల పొదల గుండా తప్పించుకుని పోలీసులకు ఈ విషయాన్ని తెలియజేసి, అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. సదరు ఫిర్యాదు ఆధారంగా, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం. మహేష్, క్రైమ్ నెం. 435 బై 2016 కింద సెక్షన్లు 342, 366, 376 (డి) రెడ్ విత్ 511, 323, 506 ఐపిసి ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తును ఆర్‌జిఐఏ పిఎస్ సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ మహ్మద్ నాసర్‌కు అప్పగించారు. దర్యాప్తు సమయంలో, దర్యాప్తు అధికారి మహ్మద్ నాసర్, అన్ని సాక్ష్యాలను సేకరించి, దాని ఆధారంగా, 13.10.2016 న నిందితులను అరెస్టు చేశారు. అబ్దుల్ రెహమాన్, మహ్మద్ అబ్దుల్ కరీం, మహ్మద్ అబ్దుల్ రహీమ్, సయ్యద్ అబ్దుల్ ఫహీమ్, మహ్మద్ ఇమ్రాన్, బండారి యాదయ్య, శంషాబాద్‌లోని దొడ్డిలో వాచ్‌మన్‌ను అరెస్టు చేసి, వారిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. విచారణ అధికారి ఎల్. రమేష్ నాయక్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సమయంలో, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు మరియు డి. మంజుల దేవి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఆర్ వన్, ప్రాసిక్యూషన్ సాక్షులను, సంబంధిత మెటీరియల్ ఆధారాలను కోర్టు ముందు హాజరుపరిచారు. విచారణ పూర్తయిన తర్వాత, 13 వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి, ఎల్బీ నగర్, రంగారెడ్డి జిల్లా తీర్పును ప్రకటించారు, నిందితులందరినీ దోషులుగా నిర్ధారించారు, బాధితురాలుకు మూడు లక్షల రూపాయలు పరిహారం అందజేశారు.

## నింగిలో విమానాలు
# నేలమీదే లాభాలు

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) దేశీ విమానయాన పరిశ్రమ నష్టాలు ముందస్తు అంచనాలకు మించి ఉండనున్నాయి. గతంలో ఇవి రూ. 9,500-10,500 కోట్లుగా ఉంటాయని పరిశ్రమ భావించినప్పటికీ, అంతకన్నా ఎక్కువగా రూ. 17,000-18,000 కోట్ల స్థాయిలో ఉండొచ్చని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా ఒక నివేదికలో తెలిపింది. విమాన ప్రయాణికుల రద్దీ తగ్గుదలతో పాటు ఇతరత్రా అంశాలు ఇందుకు కారణమని పేర్కొంది. ఇక దేశీ విమానయాన ప్రయాణికుల ట్రాఫిక్ వృద్ధి గతంలో భావించినట్లుగా 4-6 శాతంగా కాకుండా 0-3 శాతం స్థాయికే పరిమితం కావొచ్చని అంచనాలను సవరించింది. ఎయిరిండియా బోయింగ్ 787-8 విమాన దుర్ఘటన, వేల కొద్దీ ఇండిగో విమాన సేవల రద్దుతో విమాన ప్రయాణాలపై సెంటిమెంటు దెబ్బతినడం ఇందుకు కారణమని పేర్కొంది. సీమాంతర ఉద్రిక్తతలతో విమాన సేవల్లో అంతరాయాలు, పలు సర్వీసులు క్యాన్సిల్ కావడంలాంటి అంశాల వల్ల ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో ప్యాసింజర్ల రద్దీ, ఊహించిన దాని కన్నా తక్కువగా నమోదైనట్లు ఇక్రా వివరించింది.

# రాజాసాబ్ బ్లాక్ బస్టర్ కావాలి: రెబల్‌స్టార్ ప్రభాస్



రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ "రాజా సాబ్". ఈ చిత్రాన్ని హారర్ కామెడీ జానర్ లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. "రాజా సాబ్" సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో అన్ కాంప్రమైజ్డ్ గా నిర్మిస్తున్నారు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న "రాజా సాబ్" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "రాజా సాబ్" ప్రీ రిలీజ్ ఈవెంట్లో మీ అందరి కోసం కొత్త హెయిర్ స్టైల్ లో వచ్చా. అనిల్ తడానీ నా బ్రదర్ లాంటి వారు. ఆయన నా సినిమాలకు నార్త్ లో సపోర్ట్ చేస్తుంటారు. సంజయ్ దత్ గారు క్లోజ్ షాట్ పెడితే సీన్ మొత్తం తినేస్తారు, ఇది నానమ్మ, మనవడి కథ. జరీనా వాహబ్ గారు నాకు నానమ్మ క్యారెక్టర్ లో నటించారు. డబ్బింగ్ చెబుతుంటే నా సీన్స్ మర్చిపోయి నానమ్మ సీన్స్ చూస్తూ ఉండిపోయా. ఆమె నటనకు ఫ్యాన్ ను అయ్యాను. నాతో పాటు జరీనా గారు కూడా రాజా సాబ్ లో హీరోనే. రిద్ధి, మాళవిక, నిధి ముగ్గురూ బ్యూటిఫుల్ హీరోయిన్స్. ఈ ముగ్గురు తమ పర్ఫార్మెన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకుంటారు.

ఈ సినిమాకు అనుకున్న దానికన్నా బడ్జెట్ పెరిగినా ఎంతో ధైర్యంగా విశ్వప్రసాద్ గారు సినిమా నిర్మించారు. ఈ మూవీ క్లైమాక్స్ కు వచ్చేసరికి మారుతి గారి రైటింగ్ కు నేను ఫ్యాన్ అయ్యాను. ఆయన పెన్ తో రాశారా మెషీన్ గన్ తో రాశారా అనే డౌట్ వచ్చింది. హారర్ కామెడీలోనే కాదు ఇలాంటి క్లైమాక్స్ రాలేదు. మనకు 15 ఏళ్ల తర్వాత మారుతి డార్లింగ్ ఎంటర్ టైన్ మెంట్ ఇస్తున్నాడు. సంక్రాంతికి అన్ని సినిమాలతో పాటు మా రాజా సాబ్ కూడా బ్లాక్ బస్టర్ కావాలి అన్నారు.

# జనవరి 2న రాబోతోన్న ఓ అందాల రాక్షసి



దర్శకుడిగా, హీరోగా, సంగీత దర్శకుడిగా, కథకుడిగా షెరాజ్ మెహదీ అందరినీ ఆకట్టుకుంటూ ఉన్నారు. ప్రస్తుతం ఆయన 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో విహాన్ని హెగ్డే, కృతి వర్మలు హీరోయిన్లుగా నటించారు. స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్ మీద సురీందర్ కౌర్ నిర్మాతగా 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రం జనవరి 2న రాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. షెరాజ్ మెహదీ మాట్లాడుతూ .. "ఓ అందాల రాక్షసి' మూవీని జనవరి 2న భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నాను. ఒక ఏడాదికి ఓ మంచి సినిమా వస్తుంది. అలాంటి ఓ మంచి సినిమానే మా 'ఓ అందాల రాక్షసి'. ఇందులో కృతి వర్మ, విహాన్ని హెగ్డే, నేహా దేశ్ పాండే, అఖిల, గీతా రెడ్డి, స్నేహా, ప్రియా దేశ్ పాల్, సుమన్ గారు, తమ్మారెడ్డి భరద్వాజ్ గారు ఇలా చాలా మంది అద్భుతమైన పాత్రల్ని పోషించారు. అద్భుతమైన కంటెంట్‌తో రాబోతోన్న ఓ మంచి సినిమా. ఆడియెన్స్‌కి ఒక్క నిమిషం కూడా బోర్ కొట్టదు. మంచి సందేశాత్మక కథతో ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది అన్నారు. కృతి వర్మ మాట్లాడుతూ.. "ఓ అందాల రాక్షసి' మూవీలో నాకు అవకాశం ఇచ్చిన షెరాజ్ గారికి థాంక్స్. ఆ దేవుడి ఆశీస్సులు, ప్రేక్షకుల సపోర్ట్‌తో మా చిత్రం పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నాను అన్నారు. విహాన్ని హెగ్డే మాట్లాడుతూలి.. "అమ్మాయిల్ని మోసం చేస్తే.. ఆ అందం రాక్షసిగా మారుతుంది. అదే మా 'ఓ అందాల రాక్షసి' అన్నారు. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఓ మంచి ఫీల్‌తో బయటకు వస్తారు. నేటి తరం ఆడపిల్లలు ఎలా ఉండాలనే కాన్సెప్ట్‌తో ఈ మూవీని చేశాం అన్నారు కథ, మాటల రచయిత భాష్య శ్రీ.

# విజయ చిత్ర ఫిలిమ్స్ ప్రొడక్షన్ నెంబర్ 1. చిత్రం



కంటెంట్ ఉన్న చిత్రాల ట్రెండ్ నడుస్తున్న ప్రస్తుత తరుణంలో ఓ డిఫరెంట్ హర్రర్ & సస్పెన్స్ థ్రిల్లర్ కాన్సెప్ట్ తో విజయ చిత్ర ఫిల్మ్స్ పతాకంపై గుర్రపు విజయ్ కుమార్ తన తొలి ప్రయత్నంగా ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సంధ్యారాగం చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకోవడమే కాకుండా పలు అవార్డులు సొంతం చేసుకున్న దర్శకుడు శ్రీనివాస్ నేదునూరి దర్శకత్వంలో గుర్రపు విజయ్ కుమార్ నిర్మాతగా రవణం సత్యకుమార్, సునీతాప్రియ సహ నిర్మాతలుగా రూపొందిస్తున్న ఈ చిత్రం రామోజీ ఫిలిం సిటీలో ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత గుర్రపు విజయ్ కుమార్ మాట్లాడుతూ... 30 ఇయర్స్ ఇండస్ట్రీగా టాలీవుడ్ లో పాపులారిటీ సొంతం చేసుకున్న వర్సటైల్ యాక్టర్ పృథ్వీ రాజ్ తనయ శ్రీలు , ఎంవిఆర్. ప్రధాన పాత్రల్లో విజయ చిత్ర ఫిలిమ్స్ బ్యానర్ లో తెరకెక్కుతోన్న చిత్రం రామోజీ ఫిలిం సిటీ లో ఫస్ట్ షెడ్యూల్, హైదరాబాద్ లో పలు లోకేషన్స్ లో సక్సస్ ఫుల్ గా కంప్లీట్ అయినందుకు చాలా హ్యాపీగా ఉంది. ఈ షెడ్యూల్ లో హీరో హీరోయిన్స్ తో పాటు సెకండ్ లీడ్ రోల్ లో నటిస్తున్న శివాంజనేయులు,, రఘు వీర్, వెంకట్ గుప్త పాల్గొన్న సన్నివేశాలు చిత్రీకరించారు. అలాగే జబర్దస్త్ అప్పారావు, రామరాజు, పాండు, VT రాజు, విశాల్, ఆర్యఫణి నటించిన సన్నివేశాలు చిత్రీకరించడం జరిగిందనీ, థర్డ్ షెడ్యూల్ అతి తొందరలోనే స్టార్ట్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని , న్యూ ఇయర్ సందర్భంగా టైటిల్ రివీల్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు.

చిత్ర దర్శకుడు శ్రీనివాస్ నేదునూరి మాట్లాడుతూ.. హార్రర్ చిత్రాల్లో డిఫరెంట్ ఎమోషన్స్ ఉన్న సరికొత్త కాన్సెప్ట్ తో రూపొందిస్తున్న ఈ మూవీ ఫస్ట్ షెడ్యూల్ సక్సస్ ఫుల్ గా పూర్తిచేసినందుకు చిత్ర యూనిట్ కు, రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిత్ర సహ నిర్మాత రవణం సత్యకుమార్ మాట్లాడుతూ... నిర్మాత గుర్రపు విజయ్ కుమార్, దర్శకుడు శ్రీనివాస్ నేదునూరి నాకు మంచి స్నేహితులు కావడంతో ఈ చిత్రానికి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారని తెలిపారు.అతి త్వరలో ప్రొడక్షన్ నెంబర్ 2 లాంచ్ కాబోతుందని అన్నారు. ఈ చిత్ర నిర్మాణంలో మరో భాగస్వామి అయిన సునీతాప్రియ మాట్లాడుతూ..మా ప్రొడ్యూసర్, డైరక్టర్ పర్ఫెక్ట్ ప్లానింగ్ వల్లనే షూటింగ్ సజావుగా సాగుతోందని, ప్రేక్షకులకు కావాల్సిన సెంటిమెంట్, థ్రిల్లింగ్, హార్రర్, యూత్ ఎలిమెంట్స్ పుష్కలంగా ఉన్న కమర్షియల్ సినిమాలో బాగమయినందుకు సంతోషంగా ఉందని అన్నారు.



# సూపర్ స్టార్ బర్త్‌డే వేడుకకు గ్లోబల్‌స్టార్

**బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ 60వ పుట్టిన రోజు వేడుకకు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హాజ రయ్యారు. స్టార్‌లతో నిండిన ఈ వేడుకకు రామ్ చరణ్ హాజరుకావడం ఈవెంట్ ని మరింత స్పెషల్ గా మార్చింది. రామ్ చరణ్ సింపుల్, క్లాసీ లుక్‌లో అదరగొట్టారు. సాఫ్ట్ కలర్స్‌తో కూడిన క్లీన్ అవుట్ ఫిట్‌లో నేచురల్ స్టైల్‌తో అలరించారు. ఆయన స్టైల్, స్వాగ్ హైలైట్‌గా నిలిచాయి. ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది రామ్ చరణ్, సల్మాన్ ఖాన్, ఎంఎస్ ధోనీ, బాబీ డియోల్ కలిసి దిగిన ఫోటో. సినిమా, క్రికెట్ ప్రపంచాలకు చెందిన దిగ్గజాలు ఒకే ఫ్రేమ్‌లో సహజంగా నవ్వుతూ కనిపించారు. మెగా ఫ్యామిలీతో సల్మాన్‌కు ఉన్న సన్నిహిత సంబంధం, చరణ్ ప్రజెన్స్ ఈ వేడుకను ప్రత్యేకంగా మార్చింది.**

# ఇక ఓటీటీలోకి అంకిత్ కొయ్య బ్యూటీ..



అంకిత్ కొయ్య, నీలఖి కాంబోలో తెరకెక్కిన ప్రాజెక్ట్ బ్యూటీ. జేఎస్ఎస్ వర్ధన్ దర్శకత్వం వహించిన ఈ మూవీకి జేఎస్ఎస్ వర్ధన్ డైలాగ్స్ కూడా అందించాడు. హీరోహీరోయిన్ల లవ్ ట్రాక్.. తండ్రీ కూతుళ్ల రిలేషన్.. ప్రేమకథలో మలుపులు వంటి అంశాల చుట్టూ తిరిగే ఈ సినిమాలో అందరికీ ఉంటారు కూతుళ్లు.. కానీ ఇలా నెత్తిమీద పెట్టుకుని చూసేవాళ్లు మాత్రం మీరే ఉంటారంటూ సాగే డైలాగ్స్ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కాగా ఈ మూవీని థియేటర్లలో మిస్సయిన వారి కోసం ఓటీటీ రిలీజ్ అప్‌డేట్ వచ్చేసింది. బ్యూటీ పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం జీ5లో సందడి చేయనుంది. బ్యూటీ జనవరి 2న జీ5లో ప్రీమియర్ కాన్నునట్టు ప్రకటించారు. అయితే బ్యూటీ డబ్బింగ్ వెర్షన్లపై మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. ఇంకేంటి మరి బ్యూటీపై మీరూ ఓ లుక్కేయండి. ఈ మూవీకి విజయ్ బల్గానిన్ సంగీతం అందించాడు. ఈ చిత్రంలో టాలీవుడ్ సీనియర్ యాక్టర్ నరేశ్ కీ రోల్‌లో నటించగా.. వాసుకి ఆనంద్, ప్రసాద్ బెహరా, నితిన్ ప్రసన్న, మురళీగౌడ్ ఇతక కీలక పాత్రలు పోషించారు. మారుతి టీం సమర్పణలో వచ్చిన ఈ చిత్రాన్ని వానర సెల్యులాయిడ్, జీ స్టూడియోస్ బ్యానర్లపై అడిదాల విజయ్‌పాల్ రెడ్డి, ఉమేశ్ కుమార్ బన్సాల్ సంయుక్తంగా నిర్మించారు. 'కూతురు అడిగింది కొనిచ్చేటప్పుడు వచ్చే కిక్కు ఓ మధ్య తరగతి తండ్రికే తెలుస్తుంది.. తన కోసం కొంచెం కష్టపడాలి.. పడతాను..'అంటూ తండ్రి తన కూతురు కోసం చెబుతున్న ఎమోషనల్ డైలాగ్స్ అందరినీ ఇంప్రెస్ చేస్తాయి.






Owned and Published by Sirigiri Varadaraju, Printed at: Shesha Sai Enterprises, Plot No. 98/1, CIE, Phase 2, Gandhinagar, Hyderabad - 37, Telangana State, India, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com